www.citytimesnews.com

సిటీ టైమ్స్

తెలుగు దినపత్రిక

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 26 | సంచిక - 81 | హైదరాబాద్ | ఆదివారం | తేదీ:22.03.2026 | పేజీలు 8 | వెల రూ.3 | epaper.citytimesdaily.com

ప్రముఖ నృత్యకారిణి మధుమిత రౌత్ కన్నుమూత



2లో..

బుజ్జగింపులు షురూ..

- జీవన్ రెడ్డి ఇంటికి మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి
- పార్టీ వీడకుండా ఉండేందుకు చర్చలు

2లో..

- కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో జీవన్ రెడ్డి

ఇరాన్ అణు కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు

- ప్రధాన అణు ఇంధన కేంద్రాన్ని లక్ష్యంగా
- దాడి వల్ల ఎలాంటి రేడియేషన్ లీకేజీ జరగలే
- అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ప్రకటన

6లో..

- 'నటాంజ్' యురేనియం శుద్ధి కేంద్రంపై దాడి
- ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా



న్యూఢిల్లీ, సిటీ టైమ్స్

మధ్యప్రాచ్యంలో యుద్ధం మరో ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఇరాన్‌లోని అత్యంత కీలకమైన 'నటాంజ్' యురేనియం శుద్ధి కేంద్రంపై శనివారం అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా సాగిన ఈ ఆపరేషన్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది.

ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ఫోన్

- యుద్ధం మొదలైన తర్వాత రెండోసారి
- ఈద్, నౌరూజ్ సందర్భంగా మోదీ శుభాకాంక్షలు

2లో..

- పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వంపై చర్చ
- మౌలిక సౌకర్యాలపై జరుగుతున్న దాడులపై మోదీ ఖండన



న్యూఢిల్లీ, సిటీ టైమ్స్

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ఫోన్ చేసి మాట్లాడారు. ఆయనకు ఈద్, నౌరూజ్ శుభాకాంక్షలు తెలిపిన మోదీ... ఈ సందర్భంగా ఇరాన్ మౌలిక స్థావరాలపై జరిగిన దాడులను ఖండించారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం కోసం ప్రయత్నించాలని సూచించారు.

పైలెట్ రోహిత్ రెడ్డికి షాక్!

- ఫాంహౌస్‌ను సీజ్ చేసినట్లు తెలిసింది
- అసైన్డ్ భూమిపై ఫామ్ హౌస్
- మొయినాబాద్ ఫామ్ హౌస్ కేసు
- రెవెన్యూ విచారణలో సంచలన అంశాలు

7లో..



హైదరాబాద్, సిటీ టైమ్స్

మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విరల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది.

ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటైనా అమలైందా?

- 4 కోట్ల మందికి టోపీ పెట్టింది
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- రేవంత్ 6 గ్యారంటీల దస్త్రంపై సంతకం చేశారు
- సంతకం చేసిన దస్త్రం కనిపించకుండా పోయింది



6లో..

హైదరాబాద్, సిటీ టైమ్స్

కాంగ్రెస్ ప్రభుత్వం 4 కోట్ల మందికి టోపీ పెట్టిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం రోజున 6 గ్యారంటీల దస్త్రంపై సంతకం చేశారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అభయహస్తం దస్త్రంపై సీఎం తొలి సంతకం చేశారన్నారు. గవర్నర్ ప్రసంగంలోనూ ఆరు గ్యారంటీలపై సంతకం జరిగిందని చెప్పించారన్నారు.

‘‘ ఆరు గ్యారంటీల్లో అర గ్యారంటీ కూడా ఇప్పటివరకు అమలు కాలేదు. సీఎం సంతకం చేసిన దస్త్రం కనిపించకుండా పోయింది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశ పెట్టనున్నాం. వచ్చే శుక్రవారం నాడు శాసనసభలో మేం ప్రైవేటు బిల్లు పెట్టాలని నిర్ణయించాం. అందుకు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నాం. కాంగ్రెస్ హామీ ఇచ్చిన అంశమే కాబట్టి ఆ పార్టీ కూడా బిల్లుకు మద్దతు ఇవ్వాలి. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు.. వెంటనే అమలు చేయాలి. పింఛను రూ.2వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామన్నారు.. వెంటనే పెంచాలి. విద్యార్థులకు విద్యాభరోసా కార్డులు ఇస్తామన్నారు.. వెంటనే ఇవ్వాలి. కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామన్నారు.. అదీ అమలు చేయాలి. మేం పెట్టే బిల్లు పాస్ అయితే, హామీలన్నీ చట్ట ప్రకారంగా అమలవుతాయి’’ అని కేటీఆర్ పేర్కొన్నారు.

సిద్దిపేటకు రద్దు చేసిన నిధులు ఇవ్వు

- ప్రజలకు క్షమాపణ చెప్పు
- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు డిమాండ్
- మాదేమో శ్రమ ఫలితం.. మీదేమో శిలా ఫలకమా..
- ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం మాది..
- ప్రారంభోత్సవానికి కత్తెర మీదా అంటూ ఫైర్

2లో..



హైదరాబాద్: సిటీ టైమ్స్

మాదేమో శ్రమ ఫలితం.. మీదేమో శిలా ఫలకమా.., ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం మాది.. ప్రారంభోత్సవానికి కత్తెర మీదా అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలో ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రావడానికంటే ముందు జిల్లాకు రద్దు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1070 కోట్ల నిధులను విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని.. మూడు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని.. వాటన్నింటినీ రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు.


భారీగా పెరిగిన చికెన్ ధరలు

- కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ. 350
- నాటుకోడి రూ. 800 పలుకుతోంది
- మాంసం వినియోగం పదేళ్లలో 11.01 లక్షల టన్నులు
- 'సామాజిక ఆర్థిక నివేదిక 2026' ప్రకారం

హైదరాబాద్, సిటీ టైమ్స్

తెలంగాణ ప్రజలకు ముక్కలేనిదే ముద్ద దిగదు. కొందరు నాన్‌వెజ్‌కు దూరంగా ఉన్నా.. చాలా వరకు మాంసం తినేందుకు ఇష్టపడుతుంటారు. అయితే చికెన్ తినేవారికి నిజంగా ఇది చేదువార్తే అని చెప్పాలి. ఎందుకంటే చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. రంజాన్ పర్వదినం సందర్భంగా చికెన్‌కు గిరాకీ ఏర్పడటంతో ధరలు పెరిగినట్లు వ్యాపారుల చెబుతున్నారు. నిన్నటి వరకూ కేజీ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.320 వరకు ఉండగా ఈరోజు ఏకంగా రూ. 30 వరకు పెరిగింది.

7లో..



ఆ కథనాలు చూస్తే బాధేస్తోంది

- సజ్జనార్ ఎమోషనల్
- అమ్మాయిలు మరింత అప్రమత్తంగా ఉండాలి
- సినీ నటుల ఫోటోలను డీపీలుగా ఉంచుకుని..
- రెచ్చిపోతున్న కొంతమంది సైబర్ నేరగాళ్లు


7లో..

మొన్న భార్య.. తర్వాత

ఎస్సై ఆత్మహత్య

- కరీంనగర్ పోలీస్ శాఖలో విషాదం
- భార్య మరణించిన ఐదు రోజుల్లోనే సూసైడ్
- అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు
- బంధువుల నిందలు భరించలేక
- అత్తగారి ఇంట్లోనే ఉరివేసుకున్న చంద్రశేఖర్

2లో..



కరీంనగర్, సిటీ టైమ్స్

కరీంనగర్ పోలీస్ శాఖలో విషాదం చోటు చేసుకుంది. కరీంనగర్ టూ టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ సూసైడ్ చేసుకున్నారు. ఆయన భార్య ఈనెల 16న సూసైడ్ చేసుకోగా.. ఐదు రోజుల వ్యవధిలోనే ఎస్సై చంద్రశేఖర్ సైతం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా.. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు. అన్యోన్యంగా సాగుతున్న వీరి జీవితం ఒక్కసారిగా తలకిందులైంది. కారణం ఏంటో తెలియదు కానీ.. మొదట దివ్య సూసైడ్ చేసుకుంది. విషపూరితమైన గన్నేరు పప్పు తిని ఆత్మహత్యకు ప్రయత్నించగా గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.


భార్యను పనిమనిషిలా

చూడొద్దు

- ఇంటి పనుల్లో భర్తలు సాయం చేయాలి
- ఓ భర్తకు సుప్రీం క్లాస్
- ఇంటి పనుల్లో భార్యతో పాటు సమానంగా చేయాల్సిందే

7లో..

- ప్రస్తుతం కాలం మారింది



సిటీటైమ్స్
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com



ప్రముఖ నృత్యకారిణి మధుమిత రౌత్ కన్నుమూత

- ఢిల్లీలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

- లోధి శ్మశానవాటికలో అంత్యక్రియలు

న్యూఢిల్లీ, సిటీ టైమ్స్

ప్రముఖ ఒడిస్సీ కళాకారిణి మధుమిత రౌత్ (59) కన్నుమూశారు. శనివారం ఉదయం ఆమె గుండెపోటుతో మరణించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. 1950వ దశకంలో శాస్త్రీయ పరిజ్ఞానంతో ఒడిస్సీ నృత్య పునరుద్ధరణకు దోహదపడిన మాయాధర్ రౌత్ కుమార్తెనే మధుమిత రౌత్. ఈరోజు మధ్యాహ్నం 3:30 గంటలకు ఢిల్లీలోని లోధి శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు జరుగుతాయని సోదరుడు మనోజ్ రౌత్ తెలిపారు. మధుమిత చిన్న వయస్సులోనే నృత్యం నేర్చుకోవడం ప్రారంభించి.. ఢిల్లీకి చెందిన జయంతికమాయాధర్ రౌత్ స్కూల్ ఆఫ్ ఒడిస్సీ డాన్స్ డైరెక్టర్‌గా కొత్త తరం నృత్యకారులకు శిక్షణ ఇచ్చారు. మధుమిత రౌత్ నెదర్లాండ్స్‌లోని ఒక దేవాలయంలో ప్రదర్శన ఇచ్చిన మొట్టమొదటి ఒడిస్సీ కళాకారిణిగా రికార్డు సృష్టించారు. శాస్త్రీయ నృత్యాన్ని సజీవంగా ఉంచాలనే అంకితభావంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నృత్యకారులకు స్ఫూర్తినిచ్చారు. ఒడిస్సీని ప్రోత్సహించడంలో ఆమె చేసిన కృషికి గాను మధుమిత అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవాలను అందుకున్నారు. భారతదేశంలోని ప్రధాన నృత్యోత్సవాలతో పాటు ఐర్లాండ్, ఇంగ్లాండ్, స్కాట్లాండ్, నెదర్లాండ్స్, జర్మనీ, బెల్జియం, హంగరీ, ఆస్ట్రియా, స్పెయిన్, మొరాకో, ఫ్రాన్స్, పోర్చుగల్, జపాన్, యునైటెడ్ స్టేట్స్‌లోనూ అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

బుజ్జగింపులు షురూ..



హైదరాబాద్, సిటీ టైమ్స్

కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డికి బుజ్జగింపులు మొదలయ్యాయి. పార్టీ వీడకుండా ఉండేందుకు ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ సంప్రదింపులు మొదలుపెట్టారు.

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. అసలు కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేయడంపై జీవన్ రెడ్డి కొంతకాలంగా బహిరంగంగానే అసమ్మతి తెలుపుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అధిష్ఠానాన్ని కోరారు. కానీ హైకమాండ్ పట్టించుకోకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో సమావేశానికి రావాలని రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు. కానీ ఇవాళ మీనాక్షి నటరాజన్‌తో జరగాల్సిన మీటింగ్‌కు జీవన్ రెడ్డి గైర్హాజరయ్యారు.

ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి ఇంటికి ఇవాళ ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెళ్లారు. జీవన్ రెడ్డితో అల్పాహారం చేస్తూ ముచ్చటిస్తున్నారు. కాగా, రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేదని జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించకుండా రహస్యంగా చర్చిస్తున్నారు. కాగా, ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నారని సమాచారం.

మహిళపై కత్తితో దాడి.!

- తనను కాదని మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో

- మియాపూర్ లో దారుణం

- బాధితురాలు నూకరత్నం – హౌస్‌కీపింగ్ ఉద్యోగి

హైదరాబాద్, సిటీ టైమ్స్



హైదరాబాద్ నగరంలోని మియాపూర్ ప్రాంతంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తనను కాదని మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ మహిళపై కత్తితో దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కాకినాడకు చెందిన నూకరత్నం అనే మహిళ మియాపూర్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తోంది. గతంలో భర్తను కోల్పోయిన ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవలే గత నెల 20న ప్రసాద్ అనే వ్యక్తిని ఆమె వివాహం చేసుకుంది. ఇదే సమయంలో నూకరత్నం పనిచేసే చోట వంటమనిషిగా పనిచేస్తున్న ఆలీషా అలియాస్ పాండు ఆమెపై కక్ష పెంచుకున్నాడు. తనకు తెలియకుండా ప్రసాద్‌ను పెళ్లి చేసుకోవడం కారణంగా అతడు ఆగ్రహానికి గురైనట్లు సమాచారం. ఈ నెల 19న ఆలీషా తన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌తో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. తన వెంట రావాలని ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అయితే నూకరత్నం నిరాకరించడంతో కోపంతో వెంట తీసుకువచ్చిన కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఈ దాడిలో నూకరత్నం తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు ఆలీషా అలియాస్ పాండు, అతని తండ్రి లాలూను అరెస్ట్ చేశారు.

ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ఫోన్

న్యూఢిల్లీ, సిటీ టైమ్స్

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ఫోన్ చేసి మాట్లాడారు. ఆయనకు ఈద్, నౌరూజ్ శుభాకాంక్షలు తెలిపిన మోదీ... ఈ సందర్భంగా ఇరాన్ మౌలిక స్థావరాలపై జరిగిన దాడులను ఖండించారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం కోసం ప్రయత్నించాలని సూచించారు. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్ అమెరికా సంయుక్తంగా ఇరాన్ దాడులతో పశ్చిమాసియాలో యుద్ధం మొదలైంది. ఈ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇరాన్ అధ్యక్షుడికి మోదీ ఫోన్ చేయడం ఇది రెండోసారి. ఇరాన్ ప్రెసిడెంట్‌కు ఫోన్ చేసిన మాట్లాడిన విషయాన్ని మోదీ ఎక్స్ (ట్విట్టర్)లో ట్వీట్ చేశారు.

''ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడి, ఈద్, నౌరూజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగ పశ్చిమాసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకొస్తుందని మేము ఆశాభావం వ్యక్తం చేశాం.. ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగించి, ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించే ఈ ప్రాంతంలోని కీలక మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను ఖండించాం.. నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించి, జల మార్గాలు తెరిచి, సురక్షితంగా ఉండేలా చూసే ప్రాముఖ్యతను పునరుద్ఘాటించాం.. ఇరాన్‌లోని భారత పౌరుల భద్రత, రక్షణకు నిరంతరం ఇరాన్ అందిస్తున్న మద్దతును ప్రశంసించాం'' అని పోస్ట్ పెట్టారు. కాగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసిన రెండు రోజుల్లోనే ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికా సంయుక్తంగా దాడి చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ దాడి గురించి మోదీకి ముందే తెలుసా? అనే ప్రచారంపై ఇజ్రాయెల్ స్పష్టత ఇచ్చింది. ఫిబ్రవరి 28న ఉదయం ఇజ్రాయెల్ క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, 26న భారత ప్రధాని పర్యటన ముగించుకుని వెళ్లిపోయారని తెలిపింది.



సిద్దిపేటకు రద్దు చేసిన నిధులు ఇవ్వు

హైదరాబాద్; సిటీ టైమ్స్

మాదేమో శ్రమ ఫలితం.. మీదేమో శిలా ఫలకమా.., ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం మాది.. ప్రారంభోత్సవానికి కత్తెర మీదా అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలో ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రావడానికంటే ముందు జిల్లాకు రద్దు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1070 కోట్ల నిధులను విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని.. మూడు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని.. వాటన్నింటినీ రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు.

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 27 నెలల తర్వాత సిద్దిపేట నియోజకవర్గానికి ఎట్టకేలకు సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా వస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. ఇన్నాళ్లు మా నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని.. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ నియోజకవర్గం లేదన్నట్లుగా వ్యవహరించారని విమర్శించారు.. ఇప్పటికీ నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం పేరిట ఇక్కడ అడుగుపెడుతున్నారని.. ఈ సందర్భంగా మా నియోజకవర్గ ప్రజల తరపున నిన్ను కొన్ని ప్రశ్నలు అడగదలచుకున్నానని తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిఫలమే ఈ ఫామాయిల్ ఫ్యాక్టరీ. కాళేశ్వరం ప్రాజెక్టును కూలేశ్వరంగా మాట్లాడిన నీ చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభించడం శోచనీయమని హరీశ్‌రావు అన్నారు. కోనసీమ, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో కనిపించే ఫామాయిల్ మొక్కలను ఏ నదీ ప్రవాహం లేని సిద్దిపేట జిల్లాలో ఎలా సాగు చేశారో ఇప్పటికైనా మీకు అర్థమైందా..? అని ప్రశ్నించారు. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ మొక్కలు పెరుగుతాయి. మంచి దిగుబడి ఇస్తాయి. కరువు పీడిత సిద్దిపేట జిల్లాలో తేమ శాతం ఎక్కడి నుండి వచ్చిందో నీ వెంట ఉండే ఇంజనీర్లను అడుగు ముఖ్యమంత్రి గారు అని ఎద్దేవా చేశారు.


2018 లో భారతీయ ఆయిల్ పామ్ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తల బృందం సిద్దిపేట జిల్లాలో తిరిగి నీటి వసతి, గాలిలో తేమ లేదని సిద్దిపేట జిల్లా ఆయిల్ పామ్ సాగుకు అనుకూలం కాదన్నారు. కానీ 2021 లో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నిర్మితమైన అనంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ద్వారా నీటి వసతి, గాలిలో తేమశాతం పెరగడం వలన సిద్దిపేట జిల్లా ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని IIOPR శాస్త్రవేత్తల బృందం ప్రకటించిందని గుర్తుచేశారు. ఫామాయిల్ ఫ్యాక్టరీకి బీఆర్ఎస్ ప్రభుత్వమే రూ.300 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. నర్మెట్ట గ్రామ రైతుల సహకారంతో టీజీఐఐసీ ద్వారా 62 ఎకరాల భూమిని ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సేకరించామని పేర్కొన్నారు. 2022 ఏప్రిల్ 4వ తేదీన ఫ్యాక్టరీకి భూమిపూజ చేసి వెంటనే సివిల్ పనులకు టెండర్లు పిలవడం జరిగింది. పామ్ ఆయిల్ నూనె గింజల దిగుబడి వచ్చేలోగా ఫ్యాక్టరీ అందుబాటులోకి రావాలని మొదటి దశ పనులను శరవేగంగా ప్రారంభించామని తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వ్యవస్థతో మలేషియా టెక్నాలజీ తో ఈ ఆయిల్ పంప్ ఫ్యాక్టరీని నిర్మించాలని ఆనాడే నిర్ణయం తీసుకోవడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. ముందుగా క్రూడ్ ఆయిల్ ఉత్పత్తిని ప్రారంభించాక ఆ వెంటనే రిఫైనరీ ఆయిల్ ఉత్పత్తి జరిగేలా ప్లాంటును కూడా ప్రారంభించాలని ఆనాడే నిర్ణయించామని పేర్కొన్నారు. ఫ్యాక్టరీకి నీటి కొరత లేకుండా రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుండి ఎల్ డి 9 కాలువ ద్వారా 20 కోట్ల లీటర్ల నీటిని నిలువ చేసేలా స్టోరేజీ వాటర్ రిజర్వాయర్ కూడా సిద్ధం చేయడానికి 2023 జూలై నెలలో ఫౌండేషన్ వేశామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే విడుదలైన నిధులతో ఆనాడే ప్రారంభమైన పనుల కారణంగా ఇప్పుడు పూర్తయిన ఫ్యాక్టరీని మీరు ప్రారంభిస్తున్నారనే విషయాన్ని గమనించాలని సూచించారు.

ఫామాయిల్ రైతుల కళ్లలో సంతోషాన్ని చూస్తున్నామని తెలిపారు.. ఫామాయిల్ సాగుపై రైతుల్లో చైతన్యం కల్పించడం, వారిని బస్సుల్లో తీసుకెళ్లి అశ్వరావుపేట, అప్పారావుపేట లో ఫామాయిల్ పంటలను, ఫ్యాక్టరీలను సందర్శింపజేసి రైతుల్లో చైతన్యం తెచ్చామని నాటి పరిస్థితులను గుర్తుచేశారు. మొక్కలు నిరంతరంఈ అందుబాటులో ఉండేలా నర్సరీలు ఏర్పాటు చేయడం, ప్రత్యేక సబ్సిడీలతో రైతులను ప్రోత్సహించామని తెలిపారు. చివరకు దిగుబడి ప్రారంభమయ్యాక నూనెగింజల కొనుగోళ్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఇక్కడే అత్యాధునిక ఫామాయిల్ ఫ్యాక్టరీని నెలకొల్పడం అన్నీ కూడా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేము చేసిన కృషిఫలితమే అని స్పష్టం చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటు, ఫామాయిల్ తోటల సాగులో మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమేనని గుర్తుచేశారు. మీ ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ను అడగండి.. అనాడు నేను, మా రైతులు పడిన కష్టం గురించి చెబుతారని అన్నారు.

2021 జూన్ 5వ తేదీన తొలి పామాయిల్ మొక్కను నేను నాటిన విషయం ఈ జీవితాంతం గుర్తు పెట్టుకుంటానని హరీశ్‌రావు తెలిపారు. ఎందుకంటే అసలే కొత్త పంట.. దిగుబడి వస్తుందో రాదో తెలియని పరిస్థితి.. రైతుల ఆదాయం పెంచాలనే నా ఆలోచన కేసీఆర్ ఆశీస్సులతో ఇక్కడిదాకా వచ్చిందని పేర్కొన్నారు. నా ఒక్కడి మాటపై నమ్మకంతో నేడు 15 వేల ఎకరాలకు పైగా పామాయిల్ సాగు చేయడం.. పంటలు కోతకు వచ్చి మంచి దిగుబడి రావడం నాకు జీవితాంతం తృప్తిని మిగులుస్తుందన్నారు. ఏది ఏమైనా.. పామాయిల్ రైతులకు ఆర్థిక భద్రతను, మనో ధైర్యాన్ని కల్పించడానికి కేసీఆర్ గారి ఆశీస్సులతో ఇక్కడ నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్నందున.. ఇందులో నా పాత్ర కీలకంగా ఉన్నందుకు గర్వపడుతున్నానానని అన్నారు.

- 2022 జనవరి 12వ తేదీన 62 ఎకరాల భూమి కేటాయించి, మార్చి 4న భూమికి ఫెన్సింగ్ వర్క్ పనులు మరియు స్టోరేజ్ వాటర్ రిజర్వాయర్ ను ప్రారంభించామని హరీశ్‌రావు తెలిపారు 2023 ఏప్రిల్ 4న ఫ్యాక్టరీ కి పునాదిరాయి వేసి త్వరితగతిన పనులు ప్రారంభించామని చెప్పారు. మాదేమో శ్రమ ఫలితం.. మీదేమో శిలా ఫలకమా అని ప్రశ్నించారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వానిది కొండంత పాత్ర అయితే.. కాంగ్రెస్ ప్రభుత్వానిది గోరంత ప్రమేయం మాత్రమేనని చెప్పారు.



నువ్వు ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా.. అధికారంలోకి వచ్చినా మా సిద్దిపేట నియోజకవర్గంపై మీ కక్ష చల్లారదని అర్థమైందని హరీశ్‌రావు అన్నారు. నువ్వు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1070 కోట్ల నిధులను అర్ధాంతరంగా రద్దు చేశావని మండిపడ్డారు. నిధులు రద్దు చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిన విషయాన్ని మా నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రేపు అధికారికంగా వస్తున్నందున ఈ నిధులన్నీ తిరిగి తెస్తావనని ఆశిస్తున్నామని అన్నారు.

సిద్దిపేట నియోజకవర్గంలో 22,819 మంది రైతులకు రుణమాఫీ కాలేదు.. మా రైతులకు సంబంధించిన దాదాపు రూ.300 కోట్ల రూపాయల రుణమాఫీ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలోని రైతులకు నువ్వు మూడుసార్లు ఎగ్గొట్టిన దాదాపు రూ.170 కోట్ల రైతు భరోసా డబ్బులు రేపు ఇచ్చి వెళ్తావని ఆశపడుతున్నారని అన్నారు. గత మూడు సీజన్లుగా వడగళ్ల వర్షాలతో నష్టపోయిన రైతులకు రావాల్సిన పరిహారం మంజూరు చేయాలని కోరారు. నీకు సిద్దిపేట పై కక్షా పూరిత ఆలోచన లేకుంటే.. సిద్దిపేట ప్రజలపై ఈర్ష్యద్వేషాలు ఉండకుంటే.. నీవు రద్దు చేసిన నిధులన్నీ వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదు.. ఖాళీ చేతులతోనే వస్తున్న.. కత్తెరతో రిబ్బన్ కట్ చేసి వెళ్తా. అని అనుకుంటే మా ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

గత ప్రభుత్వం లో మంజూరై.. మీ ప్రభుత్వంలో రద్దయి ఆగిపోయిన పనులు


- **ప్రభుత్వ వెటర్నరీ కళాశాల**
- **రంగనాయకసాగర్ టూరిజం**
- **కోమటిచెరువు శిల్పారామం**
- **సిద్దిపేట నియోజకవర్గ బైటర్ రింగు రోడ్డు**
- **తోర్నాలలో బిఎస్సీ అగ్రికల్చర్ కళాశాల**
- **మిట్టపల్లిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భవనం**
- **సిద్దిపేటలో క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ హబ్**
- **టు టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం**
- **త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం**
- **సిద్దిపేట– ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రోడ్డు**
- **సిద్దిపేట– కిష్టాపూర్ రహదారి**
- **సిద్దిపేటలో మల్టీపర్పస్ ఆడిటోరియం**
- **సిద్దిపేట బ్లాక్‌ఆఫీస్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్**

మొన్న భార్య.. తర్వాత ఎస్సై ఆత్మహత్య

కరీంనగర్, సిటీ టైమ్స్

కరీంనగర్ పోలీస్ శాఖలో విషాదం చోటు చేసుకుంది. కరీంనగర్ టూ టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ సూసైడ్ చేసుకున్నారు. ఆయన భార్య ఈనెల 16న సూసైడ్ చేసుకోగా.. ఐదు రోజుల వ్యవధిలోనే ఎస్సై చంద్రశేఖర్ సైతం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా.. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు. అన్యోన్యంగా సాగుతున్న వీరి జీవితం ఒక్కసారిగా తలకిందులైంది. కారణం ఏంటో తెలియదు కానీ.. మొదట దివ్య సూసైడ్ చేసుకుంది. విషపూరితమైన గన్నేరు పప్పు తిని ఆత్మహత్యకు ప్రయత్నించగా గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయారు. గత కొంతకాలంగా దివ్య కడుపునొప్పితో బాధపడుతుందని ఆ నొప్పిని భరించలేకనే సూసైడ్ చేసుకున్న తెలిసింది.

అయితే దివ్య అంత్యక్రియల సమయంలో కొందరు గ్రామస్థులు, బంధువులు చంద్రశేఖర్‌పై దాడికి ప్రయత్నించారు. దివ్య మరణానికి ఆయనే కారణమని ఆరోపించారు. ఆ సమయంలో దివ్య తల్లిదండ్రులే అల్లుడిని కాపాడినప్పటికీ, ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన భార్య లేదన్న బాధ, సమాజం వేలెత్తి చూపుతుందన్న అవమానం ఆయనను వెంటాడాయి. భార్య చనిపోయిన ఐదో రోజు కార్యక్రమం కోసం చంద్రశేఖర్ ఇల్లందుకుంట మండలం సీతంపేటలోని తన అత్త గారింటికి వెళ్లారు. భార్య మరణాన్ని జీర్ణించుకోలేక, మరోవైపు బంధువుల నుంచి ఎదురైన విమర్శలతో ఎస్సై చంద్రశేఖర్ తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారు. అక్కడ భార్య జ్ఞాపకాలు ఆయనను మరింత కలచివేశాయి. అందరూ ఇంట్లోనే ఉండగా.. ఒక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్న ఆయన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎంతసేపటికీ గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన బంధువులు తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ఆయన అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు.



మొన్న భార్య.. తర్వాత
ఎస్సై ఆత్మహత్య

ఐదు రోజుల వ్యవధిలో అటు తల్లిని, ఇటు తండ్రిని కోల్పోయిన ఆ ఇద్దరు పసిపిల్లల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. అమ్మానాన్నలు ఇక లేరన్న విషయం కూడా తెలియని ఆ చిన్నారుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. క్షణికావేశంలో వారు తీసుకున్న నిర్ణయం ఇద్దరు పిల్లల్ని అనాథలు చేయటమే కాకుండా రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆత్మహత్యలకు గల కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.





నగర విస్తరణ మధ్య సహజ
వారసత్వ రాళ్ల రక్షణకు ప్రణాళిక

- ఖాజాగూడ రాళ్ల పరిరక్షణపై సిఎంసి కమిషనర్ శ్రీజన దృష్టి
- పచ్చదనంతో రాళ్ల ఉద్యానవనంగా అభివృద్ధికి రూపురేఖలు
- సరస్సు అనుసంధానం, ఫెన్సింగ్‌తో రక్షణ చర్యలకు ఆదేశాలు
- విభాగాల సమన్వయంతో సమగ్ర ప్రణాళికకు శ్రీకారం
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి అవకాశాలపై సూచనలు

సైబరాబాద్, మార్చి 21 (సిటీటైమ్స్):

నగర విస్తరణ వేగంతో సహజ సంపదలు, వారసత్వ గుర్తింపులు క్రమంగా కనుమరుగవుతున్నేపథ్యంలో ఖాజాగూడలోని సహజ వారసత్వ రాళ్ల సంరక్షణకు చర్యలు వేగవంతం కానున్నాయి. నగరానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన ఈ రాళ్లను కాపాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన ఐఏఎస్ స్పష్టం చేశారు. శనివారం ఖాజాగూడ రాళ్ల ప్రాంతాన్ని సందర్శించిన ఆమె అభివృద్ధి, రక్షణ చర్యలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. శేరిలింగంపల్లి జోన్ కమిషనర్, ఏసీ యూబీడీ, నార్సింగి, శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్లతో కలిసి రాళ్ల నిర్మాణాలను పరిశీలించారు. 'సేవ్ ది రాక్స్' సంస్థ సభ్యులు సంగీత, రుత్విక్ రాళ్ల చారిత్రక ప్రాధాన్యతను వివరించగా కమిషనర్ రాళ్ల సందర్శనలో పాల్గొని ప్రాంతంలోని ప్రత్యేకతలను తెలుసుకున్నారు.

రాళ్ల సహజ స్వరూపాన్ని కాపాడుతూ ఖాజాగూడ ప్రాంతాన్ని పచ్చదనంతో కూడిన రాళ్ల ఉద్యానవనంగా అభివృద్ధి చేయాలని సూచించారు. హెచ్ఎండీఏ, హైడ్రా, సీఎంసీ సంస్థల సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ఖాజాగూడ సరస్సుతో అనుసంధానం చేయడం, రాళ్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

భౌగోళిక, భూ వివరాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన అనుమతుల కోసం రెవెన్యూ శాఖ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ట్రెక్కింగ్, రాళ్ల ఎక్కే క్రీడలకు అనువైన ఈ ప్రాంతాన్ని నగరానికి ఊపిరితిత్తుల్లాంటి పచ్చని ప్రదేశంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. నగర భవిష్యత్తు దృష్ట్యా ఈ సహజ వారసత్వ సంపద సంరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.



ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన – శ్రీరాములకుంట పార్కులో శుభ్రత కార్యక్రమం

సిటీ టైమ్స్, కుత్బుల్లాపూర్ :

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలనే లక్ష్యంతో నిజాంపేట్ సర్కిల్ బండారి లేఅవుట్‌లోని శ్రీరాములకుంట పార్కులో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒరాకిల్ వాలంటీర్స్ పాల్గొని పార్క్ పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వినియోగం అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్క్‌కు వచ్చే ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్‌ను ఎక్కడపడితే అక్కడ వేయకుండా డస్ట్‌బిన్లలో వేయాలని సూచించారు. పిల్లలకు కూడా పరిశుభ్రత అలవాటు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే షాపింగ్‌కు వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ బ్యాగుల బదులుగా జ్యూట్, క్లాత్ సంచులను ఉపయోగించాలని, మాంసం దుకాణాలకు వెళ్లేటప్పుడు ఇంటి నుండి పాత్రలు తీసుకెళ్లాలని సూచించారు. చిన్న మార్పులతో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పెరగడం వల్ల దోమల సమస్య తీవ్రంగా మారుతోందని, కేవలం ఒక గంటలోనే ఆరు బ్యాగుల ప్లాస్టిక్ చెత్త సేకరించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒరాకిల్ వాలంటీర్స్, బండారి లే అవుట్ కాలనీవాసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆర్ఎస్ఐ మృతి

- శరీర భాగంలో గడ్డలతో ఆసుపత్రిలో చేరిక
- అనంతరం మెదడుకు రెండు సార్లు శస్త్రచికిత్స
- చికిత్సలోనే పరిస్థితి విషమించి మృతి
- భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు.. విచారణ ప్రారంభం



శేరిలింగంపల్లి, మార్చి 21 (సిటీటైమ్స్):

సిద్దిపేట కమిషనరేట్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తాళ్లపల్లి రాజ సాంబయ్య (60) చికిత్స పొందుతూ మృతి చెందాడు. శరీర భాగంలో గడ్డలు రావడంతో ఈ నెల 7న హైటెక్ సిటీ ప్రాంతంలోని యశోద ఆసుపత్రిలో ఆయనను చేర్పించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతుండగా ఈ నెల 10న మెదడుకు సంబంధించిన శస్త్రచికిత్స నిర్వహించారు. అదే రోజు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరల మెదడుకు మరో శస్త్రచికిత్స చేయాల్సి వచ్చినట్లు తెలిసింది.

అయితే చికిత్స పొందుతున్న క్రమంలో ఈ నెల 20న రాజ సాంబయ్య మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై మృతుని భార్య తాళ్లపల్లి తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు బీఎన్ఎస్ఎస్ 194 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మోర్చరీకి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు విచారణ కొనసాగుతున్నట్లు తెలిపారు.

మైనారిటీ కుటుంబాల్లో సంతోషం తీసుకురావాలి



డీసీసీ మాజీ అధ్యక్షుడు కేపం ప్రతాప్

సిటీ టైమ్స్, కుత్బుల్లాపూర్ :

రంజాన్ పండుగ సందర్భంగా దత్తాత్రేయ నగర్‌లోని నూరే మహమ్మదీయ మసీదు కమిటీ సభ్యులు రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం. ప్రతాప్ ని ఆయన నివాసంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా కే ఏం ప్రతాప్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ముస్లిం సోదర, సోదరీమణుల జీవితాలలో రంజాన్ పండుగ కొత్త శోభను, సంతోషాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఐక్యత, సౌహార్ధతతో సమాజం అభివృద్ధి చెందాలని కోరారు . ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ నగర్, ఎంఎన్ రెడ్డి నగర్‌కు చెందిన నూర్ఇమొహమ్మదీయా మసీదు కమిటీ సభ్యులు జుబేర్, ఇస్మాయిల్, ఉస్మాన్, హుస్సేన్, ఇబ్రహీం, సయ్యద్, అక్బర్, అజీమ్, మన్సూర్, అక్రమ్, హాజీ జి, నదీమ్, జాబిర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో సేవా స్ఫూర్తి

- గోపన్‌పల్లిలో రక్తదాన, వైద్య శిబిరం విజయవంతం
- ప్రముఖుల చేతుల మీదుగా ప్రారంభం.. వైద్యులకు సన్మానం

శేరిలింగంపల్లి, మార్చి 21 (సిటీటైమ్స్):

సమాజ సేవలో భాగంగా రక్తదానం వంటి కార్యక్రమాలు ప్రజల్లో మానవతా విలువలను పెంపొందిస్తాయని నల్లగండ్ల బీఆర్ఎస్ నాయకుడు రాగం హరి శంకర్ యాదవ్ అన్నారు. నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి, డైమండ్ హైట్స్‌లో లక్ష్మణరావు కుచ్చలకంటి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం, వైద్య శిబిరాన్ని ఆయన బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీ రామచంద్ర మూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణాలను కాపాడే మహత్తర సేవ అని, యువత ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఆరోగ్య సమస్యలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని, వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. రక్తదానం చేసిన వారికి అభినందనలు తెలుపుతూ, వారి సేవాభావాన్ని ముఖ్య అతిథులు ప్రశంసించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. అనంతరం రాగం హరి శంకర్ యాదవ్, బ్రహ్మశ్రీ శ్రీ రామచంద్ర మూర్తిని సన్మానించి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ మ్యాడారం, అరుణ్, సాయినాథ్ తదితరులు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

నిర్లక్ష్య వేగానికి ప్రాణం బలి

- నానక్‌రాంగూడ వద్ద తెల్లవారుజామున ప్రమాదం
- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పరారైన వాహనం
- సీసీ దృశ్యాలతో వాహనం గుర్తింపు.. గాలింపు

శేరిలింగంపల్లి, మార్చి 21 (సిటీటైమ్స్):



నగరంలో నిర్లక్ష్యంగా నడిపే వాహనాల వేగం మరో ప్రాణాన్ని బలితీసుకుంది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని నానక్‌రాంగూడ జంక్షన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్ మృతి చెందాడు. వివరాల ప్రకారం బోరబండకు చెందిన కాశి శివకుమార్ (35) ఖాజాగూడ నుంచి గండిపేట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఉదయం సుమారు 6.50 గంటల సమయంలో ఫ్రీ లెఫ్ట్ టర్న్ వద్ద గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకుమార్ ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. అతనితో పాటు వెళ్తున్న పి. దివాకర్ (24) గాయాలపాలయ్యాడు. వెంటనే అతన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య కాశి మనోజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా సీసీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించినట్లు తెలిపారు. టీజీ07ఎక్స్3199 నంబర్ గల వాహనం ఈ ప్రమాదంలో పాల్గొన్నట్లు గుర్తించారు. నిందిత వాహనం, డ్రైవర్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.



ప్రాణాంతక వ్యసనానికి విరుగుడు మందేది?

గుడి, బడి అన్న తేడా లేకుండా అన్నింటి దగ్గరా మద్యం దుకాణాలు కనిపిస్తున్నాయి. మందుబాబులు పూటుగా తాగి రోడ్డుమీదే వీరంగం సృష్టిస్తున్నారు. నేడు చాలామంది మద్యంతో పాటు డ్రగ్స్‌కూ బానిసలుగా మారుతున్నారు. ఇలాంటి వారికి చికిత్స అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతి జిల్లాలో, వైద్య కళాశాలల్లోనూ డీఅడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయించడం శుభపరిణామం. మిగతా రాష్ట్రాలకూ ఇది అనుసరణీయం. అయితే, డీఅడిక్షన్‌తో పాటు నోఅడిక్షన్‌పైనా దృష్టి సారించడం అత్యావశ్యకం.

దేశంలో మద్యం వినియోగం అంతకంతకు పెరిగిపోతోంది. అత్యధిక మద్యం వినియోగమవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ, ఏపీ ఉన్నాయి. చాలాచోట్ల ఎగువ, దిగువ తరగతి వర్గాల్లో మందు తీసుకోవడాన్ని అత్యంత సాధారణ, అంగీకారయోగ్యమైన విషయంగా చూస్తున్నారు. చాలాకాలం ఆల్కహాల్‌కు దూరంగా ఉంటూ వచ్చిన మధ్యతరగతి కూడా ఇప్పుడు మద్యపానం మత్తులో పడుతోంది. నగరాలు, గ్రామాలనే తేడా లేకుండా యువకులు, ముఖ్యంగా కాలేజీ, హైస్కూల్ విద్యార్థులు మద్యానికీ, డ్రగ్స్‌కు బానిసలుగా మారుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్‌లోని మానసిక చికిత్సాలయానికి(ఐఎంహెచ్) మొన్న ఒక్క జనవరిలోనే ఇలాంటివి 700కేసులు వచ్చాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తెలంగాణలో సుమారు 25లక్షల మంది మద్యం లేకుండా రోజు గడవని దుస్థితిలోకి వెళ్లిపోయారని అంచనా! ఇలాంటి వారి కోసం ప్రభుత్వ వైద్య కళాశాలల అనుబంధ ఆస్పత్రుల్లో పదేసి పడకలతో డీఅడిక్షన్ సెంటర్లను నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. కానీ, అక్కడ అందించే చికిత్సలు వ్యసనం నుంచి మందుబాబులను పూర్తిగా బయటపడేస్తాయా?

చుట్టుముడుతున్న వ్యాధులు...

డీఅడిక్షన్ కేంద్రాల్లో చికిత్సతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇస్తారు కాబట్టి, బాధితులపై ఆ ప్రభావం కొన్నాళ్లవరకు ఉంటుంది. కానీ, చికిత్స తరవాత వారు మళ్లీ మద్యం సేవించడానికి 60శాతం మేర అవకాశాలున్నాయి. మానసిక ఒత్తిళ్లు, ఆందోళన, కుంగుబాటు, నిరుద్యోగం, ఆర్థిక సమస్యలు, కుటుంబ పరిస్థితులు సరిగ్గా లేకపోవడం వంటివి మళ్లీ మద్యాన్ని ఆశ్రయించేలా వారిని పురిగొల్పుతున్నాయి. అయితే, 'మల్టీ మోడల్, మల్టీ స్పెషాలిటీ' సేవల ద్వారా ఈ సమస్యను అధిగమించే అవకాశముంది. బాధితులు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలకు సలహాలివ్వడంతో పాటు కుటుంబంలో, పనిచేసే చోట వారి ప్రవర్తనను గమనిస్తూ ఉండాల్సి ఉంటుంది. అయితే, దీనికి నిపుణుల తోడ్పాటు అవసరం.

దేశంలో సుమారు 17కోట్ల మంది ఆల్కహాల్ తీసుకునేవారిలో వ్యసనపరులు ఆరు కోట్ల మంది ఉంటారని అంచనా. వీరిలో మూడోవంతు మందిలో జీర్ణవ్యవస్థ పోషకాలను శోషించుకునే సామర్థ్యాన్ని కోల్పోతోంది. 15శాతం మందిలో మద్యపానం అధిక రక్తపోటుకు కారణమవుతోంది. మెదడులో రక్తస్రావం జరిగే ప్రమాదాన్ని పెంచుతోంది. లివర్ సమస్యలకూ; జీర్ణకోశ, పేగు క్యాన్సర్లకూ ఆల్కహాల్ ప్రధాన కారణమవుతోంది. ఇలా దేశంలో ఏటా దాదాపు మూడు లక్షల మరణాలకు మద్యపానమే ప్రధాన కారణమవుతోంది. అందుకనే, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆల్కహాల్‌ను గ్రూప్-1 క్యాన్సర్ కారకాల జాబితాలో చేర్చింది. అనారోగ్యానికే కాదు, మద్యపానం వల్ల భారీ సంఖ్యలో రోడ్డు ప్రమాదాలూ జరుగుతున్నాయి. నిజానికి మద్యం, మత్తుపదార్థాలకు బానిసలుగా మారిన వారిలో 5-12శాతం మంది ప్రమాదకర స్థితిలోకి వెళ్లిపోతుంటారు. తీవ్రస్థాయి మానసిక వ్యాధులు, నరాల బలహీనతకు గురవుతారు. ఆల్కహాల్ విచక్షణ కోల్పోయేలా చేసి, హింసాత్మక ఆలోచనలను ప్రేరేపిస్తుంది. సాధారణ కుటుంబాలతో పోలిస్తే, భర్త తాగొచ్చే ఇళ్లలో హింస మూడురెట్లు అధికంగా ఉంటుందని అంచనా. మద్యం మత్తులో గొడవలు, హత్యలు, ఆత్మహత్యలు జరుగుతుంటాయి. ఇంట్లో ఒక్క వ్యసనపరుడు ఉన్నా కుటుంబం మొత్తం కష్టాలపాలవుతుంది. దానివల్ల పిల్లలు అన్యాయమైపోతారు. భవిష్యత్తులో వారు కూడా మద్యంప్రియులుగా మారిపోయే ప్రమాదం ఎక్కువ! ప్రపంచవ్యాప్తంగా 20శాతం ఆత్మహత్యలు, 18శాతం హింసాత్మక ఘటనలు, 27శాతం రోడ్డు ప్రమాదాలకు మద్యమే మూలకారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. వ్యసనపరుల వైద్యానికీ, వారి కారణంగా వాటిల్లుతున్న ఇతర ఆర్థిక నష్టాలన్నీ కలిపితే మన దేశానికి ఏటా రూ.9-12లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లుతోందని అంచనా. ఆ ప్రకారం చూస్తే, మద్యం వల్ల వచ్చే రాబడి కంటే, దాని దుష్ప్రభావాలను అధిగమించడానికయ్యే ఖర్చులూ, ప్రజలు అనుభవించే బాధలే ఎక్కువనిపిస్తుంది. కాబట్టి, డీఅడిక్షన్ కంటే, నోఅడిక్షనే అన్నివిధాలా మేలు. ఆ దిశగా కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం, ప్రభుత్వాలు కలిసికట్టుగా కృషి చేయాలి. ముఖ్యంగా పిల్లల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడం, ఇంట్లో ఒత్తిడిలేని వాతావరణం కల్పించడంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. తల్లిదండ్రులు సైతం మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదు. మత్తు పదార్థాలు జీవితాన్ని ఎలా నాశనం చేస్తాయో ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలి. యువత వ్యసనాల బారిన పడకుండా ఉండాలంటే, నిరుద్యోగాన్ని పారదోలడం ముఖ్యం. అందుకని ఉపాధి అవకాశాలను గణనీయంగా పెంచాలి. వేడుకలు, సామాజిక కార్యక్రమాల్లో మద్యానికి తావులేకుండా చూడటంతో పాటు సామాజిక విలువలు, బాధ్యతల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి. మద్యనిషేధం అమలవుతున్న గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ప్రజల ఆదాయాలు, జీవితాల్లో వచ్చిన మెరుగుదలను ఇక్కడ గమనించాలి. మిగతా రాష్ట్రాలూ 'సంపూర్ణ మద్యపాన నిషేధం' గురించి ఆలోచించాలి. కిందిస్థాయిలో మత్తు వ్యసనానికి గురైనవారిని గుర్తించి, చికిత్స అందించడం ముఖ్యం. కాబట్టి, ఐఎంహెచ్ వంటి మానసిక ఆరోగ్య కేంద్రాలు నోడల్ సెంటర్లుగా వ్యవహరిస్తూ- వ్యసనపరులకు చికిత్స అందించాల్సిన విధానాలపై ప్రాథమిక స్థాయిలో వైద్యులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం మేలు. ఇప్పటికే అమలవుతున్న జిల్లాస్థాయి మానసిక ఆరోగ్య కార్యక్రమం(డీఎంహెచ్‌పీ) ద్వారా దీన్ని అమలు చేయవచ్చు. అందరూ కలిసికట్టుగా 'నోఅడిక్షన్' కోసం కృషి చేస్తే ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపడమే కాకుండా, ఎంతోమంది పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించినవారం అవుతాం.

యుద్ధం ఇస్తున్న అతిచక్కని అవకాశం!

చరిత్రను గుర్తుంచుకోవటం కష్టం. మరిచిపోవటం సులభం. మంచిపనులు చేసినవాళ్లే దాన్ని గుర్తుచేస్తూ భవిష్యత్తు తరాలకు ప్రేరణగా ఉంటారు. తప్పని కచ్చితంగా తెలిసి దారుణాలకూ దురాగతాలకూ దౌర్జన్యాలకూ పాల్పడినవారు చరిత్రను తేలికగా మర్చిపోతారు. ప్రజలు దాన్ని మర్చిపోయేలానూ చేస్తారు. వ్యక్తులకైనా దేశాలకైనా ఇదే వర్తిస్తుంది. ఇరాన్‌పై బాంబులు కురిపిస్తూ, రోజుకో విధంగా యుద్ధ కారణాలను వినిపిస్తోన్న అమెరికాకు అసలు ఉన్న చరిత్రే తక్కువ. అందులోనూ మరుపు చాలా ఎక్కువ. ఎలాంటి యుద్ధ ప్రకటన లేకుండా, ఐక్యరాజ్యసమితిలో సమస్యను చర్చించకుండా, వేలాది ప్రాణాల ఉసురుపోసుకుంటూ, ఉన్మత్తతతో ఊగిపోతూన్న అమెరికా అధ్యక్షుడు.. తన చర్యల వల్ల చరిత్రలో ఒక గొప్ప అవకాశం వచ్చిందనీ దాన్ని ఇరాన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. అసలు ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం రావటానికీ, ఆ తర్వాత అది తన పదఘట్టనల కింద ప్రజాస్వామ్యాన్ని నలిపివేయడంలోనూ అమెరికా పాత్రే కీలకం. ఆ చేదు చరిత్ర ట్రంప్‌లాంటి అమెరికా పాలకులకు ఇప్పుడు గుర్తుకు రావటంలేదు. గుర్తుచేసిన వాళ్లను జాతివ్యతిరేకులుగా ముద్రలు వేస్తున్నారు.



పశ్చిమాసియా దేశాలను వాటి మానాన వాటిని వదిలివేస్తే అవన్నీ నిజమైన ప్రజాస్వామ్యం దిశగా కొన్ని అడుగులైనా తప్పనిసరిగా వేసేవి. కానీ చమురు సంపదలపై గుత్తాధిపత్యాన్ని నెలకొల్పుకొనే లక్ష్యంతో ప్రజాబలంతో అక్కడ ప్రభుత్వాలు ఏర్పడకుండా ముందుగా బ్రిటన్, ఆ తర్వాత అమెరికా శక్తివంచన లేకుండా పనిచేశాయి. అందుకే అమెరికా ప్రాపకంలోని పశ్చిమాసియాలో ప్రజాస్వామిక ప్రభుత్వాలూ లేవు. బహుళపార్టీలు కలిగిన రాజకీయ వ్యవస్థలూ లేవు. లౌకికవాదం ఉన్నచోట భిన్నాభిప్రాయాలకు తావు ఉంటుంది. అవి ఉన్నచోట ప్రజాస్వామ్య రాజకీయాలు ఉంటాయి. పశ్చిమాసియాలో అలాంటివి బలపడకుండా ఉండటానికి మతశక్తులకూ రాజరికాలకూ అమెరికా వెన్నుదన్నుగా నిలిచింది. ప్రజాస్వామ్యశక్తులు ఏదోవిధంగా బలపడిన చోట వాటిని నిర్వీర్యంచేసే దాకా నిద్రపోలేదు. బహుళపక్ష రాజకీయాలు ఉంటే ఆర్థిక విధానాల మంచిచెడులపై విశ్లేషణలు వస్తాయి. విదేశీ కంపెనీలు తరలించే సొమ్ముల లెక్కలు తేలుతాయి. ఈ బెడద లేకుండా ఉండాలంటే అక్కడి దేశాలను నయానో భయానో ప్రజాస్వామ్యానికి దూరంగా ఉంచాలి. 20వ శతాబ్దంలోనూ రాజరికాలనూ, నియంతృత్వాలనూ చలాయించాలని చూసే స్థానిక పాలకులకూ ఆ ధోరణి నచ్చింది.

చమురు సంపదపై ఆధిపత్యం కోసం ఇరాన్‌లో ప్రజాస్వామ్యాన్ని బలిపెట్టటానికి అమెరికా ఏమాత్రం వెనుకాడలేదు. రాజరికపు అధికారాలకు కత్తెర వేయాలనే డిమాండుతో ఇరాన్ ప్రజలు 1906లోనే ఉద్యమించారు. టెహరాన్ వీధులను ఆందోళనలతో హోరెత్తించారు. ప్రజల ఒత్తిడితో ఆనాటి రాజు షా మొజాఫర్ అద్-దిన్‌కు నేషనల్ అసెంబ్లీని (పార్లమెంట్) ఏర్పాటుచేయక తప్పలేదు. కొత్త రాజ్యాంగమూ రూపొందింది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందూ ఆ తర్వాతా ఏర్పడిన అల్లకల్లోల పరిస్థితుల్లో 1921లో రెజాఖాన్ పహ్లవీ అధికారాన్ని చేపట్టి రాజుగా (షా) ప్రకటించుకున్నాడు. అప్పటికి 20 ఏళ్ల ముందే బ్రిటన్‌కు చెందిన వ్యాపారవేత్తకు ఇరాన్‌లో చమురు అన్వేషణపై గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టారు. భారీగా ఉన్న చమురు నిల్వలను వెలికితీసి అమ్మటానికి ఆంగ్లో-ఇరానియన్ కంపెనీ ఏర్పడింది. పేరులో ఇరానీ ఉన్నా లాభాల్లో ఇరాన్ ప్రభుత్వానికి దక్కేది చాలా తక్కువ. అందుకే చమురు సంపదపై గుత్తాధిపత్యంతో విపరీత లాభాలను ఆర్జిస్తున్న ఆంగ్లో-ఇరానీ కంపెనీని జాతీయం చేయాలని ప్రజలందరూ కోరుకున్నారు. ఆ ప్రజాకాంక్షకు ప్రతీకగా నిలిచిన వారిలో నేషనల్ ఫ్రంట్‌కు నాయకుడైన ముహమ్మద్ మొసాద్దేగ్ ప్రముఖుడు. ప్రపంచబ్యాంకు అంటేనే అమెరికాకు అనుకూలం. అట్లాంటి ఆ బ్యాంకు ఇచ్చిన లెక్కలే చమురు దోపిడీని బట్టబయలు చేశాయి. 1914-1951 మధ్య 3.64 బిలియన్ డాలర్ల లాభాన్ని ఆంగ్లో-ఇరానియన్ కంపెనీ పొందింది. ఇరాన్ ప్రభుత్వానికి వచ్చింది 50 మిలియన్ డాలర్లు మాత్రమే. వనరులున్న దేశానికి కంటే మూడురెట్లు (1.5 బిలియన్ డాలర్లు) బ్రిటన్‌కు పన్నుల రూపంలో దక్కింది. చమురుపై గుత్తాధిపత్యాన్ని తొలగించటం ఆనాటి రాజకీయాలకు కేంద్ర బిందువైంది. మొసాద్దేగ్‌ను ప్రధానిని చేయాలని పార్లమెంట్ రెజాషాపై ఒత్తిడి తెచ్చింది. గత్యంతరంలేక దానికి ఆమోదం తెలిపారు. చమురును జాతీయం చేయాలని పార్లమెంట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. దీంతో బ్రిటన్, అమెరికాలు ఉలిక్కిపడ్డాయి. ఇరాన్ చమురు బయటకు వెళ్లకుండా బ్రిటన్ ఆంక్షలు విధించింది. జాతీయం చేసినందుకు నష్టపరిహారం ఇస్తామన్నా ఆంగ్లో-ఇరానియన్ కంపెనీ అంగీకరించలేదు. చమురుకు తోడు ఇతర ఆర్థిక ఆంక్షలనూ బ్రిటన్ విధించింది. ఆంక్షలు ఇరాన్‌ను కుంగదీయటం మొదలుపెట్టాయి. వేలాదిమంది ఉద్యోగాలను కోల్పోయారు. విసిగిపోయిన మొసాద్దేగ్ ఒక దశలో రాజీనామా చేసినా ప్రజలు ఆందోళనలు చేసి మళ్లీ అధికారాన్ని కట్టబెట్టారు. చమురు రంగం జాతీయం చేయటానికే మొసాద్దేగ్ పరిమితం కాలేదు. చాలా సంస్కరణలనూ తీసుకువచ్చారు. వెట్టిచాకిరీని నిర్మూలించారు. భూస్వాములపై 20 శాతం పన్నులువేశారు. నిరుద్యోగ భృతిని ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సౌకర్యాలను మెరుగుపరచారు. రాజకీయ స్వేచ్ఛను కల్పించారు. మహిళా హక్కులకు రక్షణ ఇచ్చారు.ప్రజాస్వామ్యం ఇరాన్‌లో అట్లా బలపడుతున్న తరుణంలో ఆపరేషన్ అజాక్స్ పేరుతో మొసాద్దేగ్ ప్రభుత్వాన్ని కూల్చటానికి అమెరికా, బ్రిటన్‌లు పావులు కదిపాయి. పార్లమెంటు అధికారాల్ని కుదించి షాకు అడ్డులేకుండా చేయటానికి అలజడులు లేవదీశాయి. ప్రజాప్రతినిధులకు లంచాలు ఇచ్చారు.అమెరికా, ఇరాన్ ప్రసార సాధనాల్లో మొసాద్దేగ్‌కు వ్యతిరేకంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కమ్యూనిస్టు పార్టీతో మొసాద్దేగ్‌కు సంబంధాలు ఉన్నాయంటూ ఆరోపణలను ఎక్కుపెట్టారు. మతపెద్దలకు సీఐఏ ఏజెంట్లు మారుపేర్లతో ఫోన్లుచేసి భయపెట్టారు. బాంబులు పెట్టి ఒక మతపెద్ద నివాసాన్ని పేల్చివేశారు.డబ్బులిచ్చి వీధి రౌడీలతో విధ్వంసం సృష్టించారు. వందల్లో ప్రజలు చనిపోయారు. దేశంలో చెలరేగిన అల్లకల్లోలం అంతా మొసాద్దేగ్ వల్లేనని నమ్మించేలా భయానక వాతావరణాన్ని సృష్టించారు. చివరిగా మిలటరీలో తమ అనుకూలశక్తుల్ని ఊసిగొల్పి ప్రధానమంత్రిని జైల్లో పెట్టించారు. ఇరాన్‌లో అట్లా ప్రజాస్వామ్యం గొంతునులిమేశారు. అప్పట్లో ఇరాన్‌లో సీఐఏ ఏజంటుగా పనిచేసిన దాన్ విల్బర్ అవన్నీ కళ్ల కుకట్టినట్లుగా తన నివేదికల్లో రాశారు. ఆపరేషన్ అజాక్స్ తర్వాత 1979 వరకూ అమెరికా అండతో షా పూర్తి నియంతృత్వాన్ని ఏర్పరచారు. చమురుపై కొత్త ఒప్పందం కుదిరింది. అంగ్లో-ఇరానీ కంపెనీ పేరు బ్రిటిష్ పెట్రోలియంగా మారింది. 40 శాతం షేర్లు బ్రిటిష్ కంపెనీకి దక్కితే మరో 40 శాతం షేర్లను అయిదు అమెరికన్ కంపెనీలు పంచుకున్నాయి. మిగతా 20 శాతం షేర్లు ఫ్రెంచ్, డచ్ కంపెనీలకు వెళ్లాయి. 25 ఏళ్ల షా పాలనలో వైట్ రెవల్యూషన్ పేరుతో చేపట్టిన చర్యలు అసమానతలను విపరీతంగా పెంచాయి. విపక్ష నాయకులను జైళ్లలో కుక్కారు. అమెరికా నుంచి ఆయుధాలను లెక్కలేనట్లుగా కొన్నారు. 1972-76 మధ్య 10 బిలియన్లను ఆయుధాలకోసం ఖర్చుపెట్టారు. వ్యవసాయంలో యాంత్రీకరణతో రైతులకు ఉపాధి పోవటంతో నగరాలకు వలస వచ్చారు. అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల సరుకుల దిగుబడులతో స్థానిక ఉత్పత్తులూ వ్యాపారాలూ దెబ్బతిన్నాయి. మతసంస్థల భూములను స్వాధీనం చేసుకోవాలని చూడటంతో అలజడి మొదలైంది. ఇవన్నీ కలిసి ఇస్లామిక్ విప్లవానికి దారితీశాయి. నిజానికి ఇస్లామిక్ విప్లవం గొడుగుకింద ప్రజాస్వామ్య, లౌకికశక్తులన్నీ ఏకమై ఉద్యమాన్ని నడిపాయి. అయతొల్లా ఖొమేనీ చేతిలోకి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొద్దికాలం ప్రజాస్వామ్య పార్టీల ప్రతినిధులకు ప్రభుత్వంలో ప్రాతినిధ్యం ఉండేది. ఆ తర్వాత మొదలైన ఇరాక్-ఇరాన్ యుద్ధంతో అంతా మారిపోయింది. అమెరికా అండతో ఎనిమిదేళ్లు సాగిన ఆ యుద్ధంనాటి పరిస్థితులను ఉపయోగించుకుని లౌకిక ప్రజాస్వామ్య పార్టీలనూ, నేతలనూ.. కార్యకర్తలనూ బలహీనపర్చటమూ, హతమార్చటమూ విపరీతంగా జరిగింది. దీంతో అయతొల్లా ఖొమేనీ ఆధిపత్యానికి అడ్డులేకుండా పోయింది. వరుసగా జరిగిన ఈ పరిణామాలన్నిటినీ గుర్తుచేసుకుంటే ఈనాటి ఇరాన్ పరిస్థితికి అమెరికా నిర్వహించిన పాత్ర ఏమిటో స్పష్టంగానే తెలుస్తుంది. ప్రజాస్వామ్యాన్ని కాలరాసివేయటానికీ మతవాద రాజకీయవ్యవస్థ ఉక్కుచట్రంలో ఇరాన్ నలిగిపోవటానికీ అమెరికానే రంగాన్ని సిద్ధంచేసింది. స్వలాభం, పశ్చిమాసియా ఆధిపత్యం కోసం ఒకనాడు ఒక ఘోరచరిత్రను సృష్టించి ఇప్పుడో కొత్త చరిత్రకు ఇరానీయులకు అపకాశం ఇస్తున్నామంటూ ప్రకటించటం అమెరికాకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఎన్నో దేశాలు ప్రజాస్వామ్య సమాజాల కోసం, స్వతంత్ర నిర్ణయాల కోసం, వనరులపై సొంత అజమాయిషీ కోసం కొత్త చరిత్రను సృష్టించటానికి ప్రయత్నాలు చేసినచోటల్లా అమెరికానే వాటిని తుంచివేసింది. 1893లో హవాయి దీవులను స్వాధీనం చేసుకోవటంతో మొదలై 2003లో ఇరాక్‌పై దండయాత్రవరకూ అమెరికా పాల్పడిన చర్యలూ దారుణాల వివరాలన్నీ స్టీఫెన్ కింజర్ రాసిన 'ఓవర్‌త్రో' పుస్తకంలో విపులంగా ఉన్నాయి. 110 ఏళ్ల కాలంలో 14 చోట్ల తను అనుకున్నట్లుగా బలవంతంగా ప్రభుత్వాలను మార్చింది. అందులో 1953 నాటి ఇరానూ ఉంది. ఎక్కడా ప్రజాస్వామ్యం పాదుకోలేదు. అస్థిరత్వం, నియంతృత్వాలు, సంక్షోభాలే ఏర్పడ్డాయి. తేడా అల్లా ఒక్కటే. అప్పుడు అవి చాలావరకూ ఆ దేశాలకే పరిమితమయ్యాయి. ఇప్పుడు ఇరాన్‌పై బాంబుల దాడితో అవి పశ్చిమాసియానంతా కమ్ముకుంటున్నాయి. ఇరాన్ ప్రజల సంగతేమో కానీ అమెరికా నిర్హేతుక యుద్ధం అన్ని దేశాలకూ కొత్త చరిత్రకు అవకాశం ఇస్తోంది. అమెరికా ఆధిపత్యాన్నీ అపసవ్య ధోరణులనూ సామ్రాజ్యవాద తత్వాన్నీ ఎదుర్కోవటం అనివార్యమయ్యేలా రంగాన్ని సిద్ధంచేస్తోంది. ఇంత కుమించి చరిత్ర ఇస్తున్న గొప్ప అవకాశం మరొకటి ఉంటుందా?

ఆరోగ్యంపై మహత్తర ముందడుగు

ఒక క్యాన్సర్ వైద్యుడిగా దశాబ్దాలుగా పని చేస్తున్న నేను– ఈ కాన్సర్ ఎంతటి నష్టం కలిగిస్తుందో చూశాను, అలాగే ఆధునిక వైద్యం సాధించిన గొప్ప విజయాలను కూడా చూశాను. 14 ఏళ్ల బాలికల కోసం దేశవ్యాప్తంగా 'హ్యూమన్ పాపిలోమా వైరస్' (HPV) ఉచిత టీకా కార్యక్రమాన్ని ఇటీవల భారత ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నిర్ణయం దేశ ప్రజారోగ్య చరిత్రలో ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. భారత ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నాకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో నిర్వహిస్తోన్న ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యాక్సినేషన్ ప్రక్రియ మాత్రమే కాదు. ఇది ఎంతోమంది భారతీయ యువతుల ఆరోగ్యాన్ని, భవిష్యత్తును రక్షించే దిశగా తీసుకున్న గొప్ప ముందడుగు. చాలా కాలంగా సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) నిశ్శబ్దంగా విస్తరిస్తూ, దేశంలో పెద్ద ఆరోగ్య సమస్యగా మారింది. ఇది మన భారతీయ మహిళల్లో కనిపించే రెండో అత్యంత సాధారణ క్యాన్సర్. ఈ వ్యాధికి సంబంధించి ప్రతి ఏడాది– దాదాపు 80 వేల కొత్త కేసులు నమోదవడమేగాక, 42వేల మందికి పైగా మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే ఈ సర్వైకల్ క్యాన్సర్ కేసులలో చాలా వరకూ పూర్తిగా నిరోధించగలిగినవే. సుమారు 80 శాతం కంటే ఎక్కువ సర్వైకల్ క్యాన్సర్ కేసులు అధిక ప్రమాదం



కలిగిన HPV వైరస్‌ల వల్లనే వస్తాయి. ముఖ్యంగా హెచ్‌పీవీ–16తో పాటు హెచ్‌పీవీ–18 అనే వైరస్ రకాలే ఈ దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్‌కు కారణం.

వ్యాధి వచ్చాక చికిత్స చేయడం కంటే, వ్యాధి రాకుండా ముందే నివారించడం ఉత్తమం. కాబట్టి భారత్ ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టింది. ప్రతి ఏడాది 1.2 కోట్ల మంది బాలికలకు టీకాలు అందించాలనే ప్రభుత్వ నిర్ణయం ఎంతో ప్రశంసనీయమైనది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందజేస్తోన్న గార్డాసిల్ వ్యాక్సిన్- హెచ్‌పీవీ 6, 11, 16, 18 రకాల వైరస్‌ల నుంచి మహిళలకు రక్షణ ఇస్తుంది. ఎంతో ఖర్చుతో కూడిన ఈ టీకాను మూడు నెలల పాటు నిర్ణీత ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించడానికి U-WIN అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది.

క్యాన్సర్ వైద్య నిపుణులుగా పరిశోధనల్లో మేం తెలుసుకున్నది ఏమిటంటే, నైంగిక జీవితం ప్రారంభం కావడానికి ముందే బాలికలకు ఈ టీకాను ఇవ్వడం చాలా అవసరం. ఎందుకంటే హెచ్‌పీవీ ఇన్ఫెక్షన్ తెలియకుండానే వస్తుంది. ఒక్కసారి ఈ వ్యాధికి గురైతే తర్వాత దాన్ని పూర్తిగా తొలగించలేం. ఈ టీకా చాలా సురక్షితమైనది, ఎంతో ప్రభావవంతమైనది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 50 కోట్లకు పైగా డోసులు ఇచ్చి, పూర్తిగా పరీక్షించబడింది.

ఈ చరిత్రాత్మక టీకా కార్యక్రమ నిర్వహణను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. గర్భాశయ క్యాన్సర్ నివారణపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన 'క్వాడ్ క్యాన్సర్ మూన్‌షాట్' వంటి అంతర్జాతీయ వేదికల్లో ఈ కాన్సర్ (ముందస్తుగా సర్వికల్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, తక్కువ ఖర్చుతో చికిత్స, టీకాల అందుబాటు వంటి అంశాలు)పై ప్రస్తావించారు. ఎంతో దృఢసంకల్పం, కార్యదీక్ష ఉంటే తప్ప ఇలాంటి కార్యక్రమం అమలు సాధ్యం కాదు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం కోసం Gavi (ప్రపంచవ్యాప్తంగా టీకాల అందుబాటును పెంచేందుకు పనిచేసే అంతర్జాతీయ సంస్థ) నుంచి 2.6 కోట్ల టీకా డోసులు పొందడం చూస్తే, ఈ కార్యక్రమ నిర్వహణకు భారత ప్రభుత్వం ఎంతగా కృషి చేస్తోందో అర్థమవుతోంది.

ఒక వైద్య నిపుణుడిగా, మహిళల క్యాన్సర్ సంరక్షణకు జీవితాంతం కట్టుబడిన వ్యక్తిగా నేను విన్నవించేది ఒక్కటే. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలందరూ ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమంపై సమాజంలో అవగాహన కలిగించాలి. మనమంతా కలిసి ఈ టీకాలపై సమాజంలో నెలకొన్న అపోహలను తొలగించాలి. పద్నాలుగేళ్ల ప్రతి బాలిక ఈ సింగిల్ డోస్ టీకాతో రక్షణ పొందేలా కృషి చేయాలి. అప్పుడే భవిష్యత్తులో వేలాదిమంది మహిళలను సర్వికల్ క్యాన్సర్ నుంచి రక్షించగలుగుతాము. శాస్త్రీయంగా విశ్వసనీయత కలిగిన ఈ టీకాను అందించడం ద్వారా దేశంలోని ఆడబిడ్డల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్న సందేశాన్ని ప్రపంచానికి భారత దేశం అందిస్తోంది.

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఇప్పుడు మనం ఒక కొత్త యుగం ప్రారంభ దశలో నిలబడి ఉన్నాం. ఒకప్పుడు భయంకరంగా భావించిన ఈ సర్వైకల్ క్యాన్సర్, త్వరలోనే చరిత్ర పుస్తకాలలో మాత్రమే ఉండే వ్యాధిగా మారే రోజు దగ్గరలోనే ఉంది. అప్పుడు భారత మహిళలు ఇంకా ఎక్కువ కాలం, ఆరోగ్యంగా, మరింత శక్తిమంతంగా జీవించే అవకాశం పొందుతారు.

డొల్ల బడ్జెట్ ...గోల్ మాల్ బడ్జెట్...

- అంకెల గారడితో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం...
- 3లక్షల కోట్ల అప్పచేసి మూడు అంటే మూడు పథకాలు పూర్తిచేయలేని దుస్థితి రేవంత్ రెడ్డిది...
- తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ :మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి

వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ మార్చి 21



శనివారం రోజు వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన స్వగృహంలో పత్రికా సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని,రాష్ట్రాన్ని తిరోగమన దిశలో నెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉందని ఎద్దవా చేశారు.ఆరు గ్యారంటీలు 11డిక్లరేషన్లు అన్ని మోసమేననిభారతదేశ చరిత్ర లో ప్రజలను ఇంత దగాపురితంగా మోసం చేసే బడ్జెట్ నేను చూడలేదని దుయ్యబట్టారు.ఎన్నికల డిక్లరేషన్లో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క వాగ్దానం నిలుపు కోకుండామహిళలను,వృద్ధులను,దివ్యాంగులను ,విద్యార్థినులను,రైతులను,కార్మికులను,ఉపాధి కూలీలను,హరిజన,గిరిజన,బడుగు బలహీన,మైనార్టీ వర్గాలను మోసం చేసి చరిత్రలోకి ఎక్కిందని నిరంజన్ రెడ్డి ఆరోపించారు.ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,మాజీ ఎం.పి.పిక్యష్టానాయక్,గంధం .పరంజ్యోతి,గోపాల్ పేట మండల అధ్యక్షులు బాలరాజు, పెబ్బేరు మండలం అధ్యక్షులు వనం. రాములు,కర్రెస్వామి,నాయకులు ధర్మా నాయక్,దేవర్ల.నరసింహ,నాగన్న యాదవ్,నారాయణ నాయక్, జోహెబ్ హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి,చిట్యాల.రాము,వడ్డే. రమేష్ మంద.రాము,శంకర్ తదితరులు ఉన్నారు.

వనపర్తి జిల్లా యువత అగ్నివీర్ నియామకాలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి మార్చి 21 (సిటీ టైమ్స్)



భారత సైన్యంలో 2027 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో 'అగ్నివీర్' పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమైనట్లు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. వనపర్తి జిల్లాలోని అర్హులైన అవివాహిత యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అభ్యర్థులు కేవలం ఆన్‌లైన్ ద్వారా www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఏప్రిల్ 01, 2026 వరకు గడువు ఉందన్నారు. అన్ని అగ్నివీర్ కేటగిరీలకు గరిష్ఠ వయోపరిమితిని 21 ఏళ్ల నుండి 22 ఏళ్లకు పెంచడం జరిగిందన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ (10వ తరగతి & 8వ తరగతి పాస్) కేటగిరి లకు నియామకాలు జరుగుతాయని చెప్పారు. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (CEE) అడ్మిట్ కార్డుల కోసం జూన్ 01 నుండి జూన్ 15, 2026 వరకు నిర్దేశించిన వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పరీక్ష తెలుగుతోసహా 13 భాషల్లో అందుబాటులో ఉంటుందన్నారు ఐటిఐ (ITI), డిప్లొమా మరియు ఎన్‌సిసి (NCC) అర్హత కలిగిన అభ్యర్థులకు బోనస్ మార్కులు ఇవ్వబడతాయని తెలిపారు.ఈ నియామక ప్రక్రియ పూర్తిగా అత్యంత పారదర్శకంగా నిర్వహించబడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామనే మోసగాళ్లను, దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని, కేవలం ప్రతిభ ఆధారంగానే ఎంపిక జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సందేహాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం ఫోన్ నంబర్ 040 27740059 ను సంప్రదించవచ్చు.

సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో లెట్రిన్ పైప్ లీక్ ఘటన





దుర్వాసనతో చుట్టుపక్కల స్థానికులలో ఆందోళన

కొత్తకోట సిటీ టైమ్స్ మార్చి 21:

కొత్తకోట లో గల సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో లెట్రిన్ పైప్ లీక్ కావడంతో విద్యార్థులలో ఆందోళనకు గురిచేస్తుంది. పాఠశాల ప్రాంగణంలో ఈ లెట్రిన్ ఇన్ పైప్ లీక్ కావడంతో దుర్వాసన వస్తుంది. పక్కనే ఆనుకొని ఉన్న డైనింగ్ హాల్లో విద్యార్థులు భోజనం చేయడానికి దుర్వాసన రావడంతో ఇబ్బందిగా మారింది. గత మూడు రోజుల నుండి ఈ ప్రాబ్లం ఉంది ఇంతవరకు స్పందించకపోవడం సోషల్ వెల్ఫేర్ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యానికి ప్రత్యక్ష నిదర్శనం. ఈ విషయంపై సంబంధిత అధికారులు తక్షణమే లెట్రిన్ పైప్ లీకేజీ మరమ్మతు చేసి విద్యార్థుల ఆరోగ్యానికి హాని కలవకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికులు కోరుతున్నారు.

పిఆర్సీకి నిధులెక్కడ...?

- నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కు బడ్జెట్ కేటాయింపులు హర్షణీయం...
- విద్యారంగానికి 15% బడ్జెట్ కేటాయించాలి....
- టి.ఎస్.యు.టి.ఎఫ్, వనపర్తి జిల్లా కమిటీ....
- యు టి ఫ్ జిల్లా అధ్యక్షుడు
- రవి ప్రసాద్ గౌడ్..
- ప్రధాన కార్యదర్శి డి కృష్ణయ్య...

వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ మార్చి 21



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 27సం.ర బడ్జెట్ కేటాయింపులో పిఆర్సీ ప్రస్తావన, పెండింగ్ బిల్లులకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమని టీఎస్ యుటిఎఫ్ వనపర్తి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ రవి ప్రసాద్ గౌడ్,డి కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటన చేశారు.
రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ప్రకటించడం,వాటికి బడ్జెట్ సైతం కేటాయించడం హర్షణీయమని, కానీ సమగ్ర శిక్ష సిబ్బంది గురించి ప్రస్తావించకపోవడం సరియైందికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో విద్యారంగానికి సంబంధించిన కొన్ని సానుకూల అంశాలను స్వాగతిస్తున్నామని, మొత్తంగా కేటాయింపులు అవసరానికి తక్కువగా ఉన్నాయని, విద్యారంగానికి బడ్జెట్ మరింత పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యారంగానికి గత సంవత్సరం కంటే 0.65 శాతం బడ్జెట్ పెరిగినప్పటికీ, మొత్తం బడ్జెట్ వ్యయం 3,24,234 కోట్లలో, విద్యారంగానికి 26,674 కోట్లు అంటే కేవలం 8.22% మాత్రమే కేటాయించడం అందోళనకరమని అన్నారు. జాతీయ స్థాయిలో కొఠారి కమిషన్ సూచించిన 30 శాతం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనబడిన 15 శాతం నిధులతో పోలిస్తే ఇది చాలా తక్కువని పేర్కొన్నారు. బడ్జెట్లో విద్యారంగానికి 15% నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రిప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రవేశపెట్టడం, జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం, గురుకులాలు మరియు వసతి గృహాల్లో వంటశాలల ఆధునీకరణకు నిధులు కేటాయించడం వంటి నిర్ణయాలను అభినందించారు.
KGBV, URS కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోలేదని, ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, వాటి అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులకు 01.07.2023 నుండి అమలు చేయవలసిన PRC,మేలు చేయాలని,నాలుగు DAలు, పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.



బార్ కౌన్సిల్‌లో మళ్లీ సునీల్ గౌడ్ ఆధిపత్యం

- మూడోసారి విజయం.. న్యాయవాదుల్లో ఆనందం
- చైర్మన్ పదవికి సునీల్ గౌడ్‌కు మద్దతు వెల్లువ

హైదరాబాద్, మార్చి 21 (సిటీటైమ్స్):

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో కుంచ సునీల్ గౌడ్ వరుసగా మూడోసారి విజయం సాధించి తన ప్రభావాన్ని మరింత బలపరిచారు. వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన గెలుపుతో రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. హైకోర్టు సీనియర్ న్యాయవాదులు, తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆయనను అభినందించారు. 2011లో తొలిసారి బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన సునీల్ గౌడ్, న్యాయవాదుల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ గుర్తింపు పొందారు. 2018లో మళ్లీ ఎన్నికై, అనంతరం సభ్యుల మద్దతుతో వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వృత్తిపరమైన సమస్యలు, సంక్షేమ అంశాలపై కృషి చేస్తూ న్యాయవాదుల్లో విశ్వాసాన్ని పెంచుకున్న ఆయనకు ఈసారి కూడా విస్తృత మద్దతు లభించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వరుసగా మూడోసారి విజయం సాధించడంతో న్యాయవాదుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ఆయనను బార్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎన్నుకోవాలని పలు న్యాయవాద సంఘాలు మద్దతు ప్రకటించడం గమనార్హం. ఈ సందర్భంగా సునీల్ గౌడ్ మాట్లాడుతూ, “నన్ను గెలిపించిన ప్రతి న్యాయవాదికి కృతజ్ఞతలు. వారి హక్కుల కోసం మరింతగా కృషి చేస్తాను” అని తెలిపారు. అలాగే నూతనంగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం పట్ల హర్షం వ్యక్తం చేసిన : లెక్చరర్ కృష్ణయ్య

వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ మార్చి 21




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం పట్ల తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ వనపర్తి జిల్లా 475 అసోసియేషన్ నాయకులు సంతోషాన్ని ,హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామనడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ మొదటి,రెండవ సంవత్సరం విద్యార్థులు సుమారు రెండు లక్షల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుందని తెలిపారు. ఈ పథకం పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకుఎంతోఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు కృతజ్ఞతలు అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్య వెంకటరెడ్డి తెలిపారు.ఈ పథకం వలన ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్లు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పూర్వవైభం సంతరించుకోనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సంఘం నాయకులు కృతజ్ఞతలు, మరియు హర్షం వ్యక్తం చేయడం జరిగింది.

నేడు బండ్ల గూడా పద్మశ్రీ హిల్స్ కాలనీలో కమ్యూనిటీ స్వచ్ఛత సేవ కార్యక్రమం

పద్మశ్రీ హిల్స్ కాలనీ ప్రధాన కార్యదర్శి అమరేందర్ రెడ్డి

బండ్ల గూడా సిటీ టైమ్స్ మార్చి 21

జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగీర్, పద్మశ్రీ హిల్స్ కాలనీ లో ఆదివారం కమ్యూనిటీ స్వచ్ఛత కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు పద్మశ్రీ హిల్స్ కాలనీ ప్రధాన కార్యదర్శి అమరేందర్ రెడ్డి తెలిపారు. సివిక్ ట్రాన్స్ఫర్మేషన్ మూమెంట్ సభ్యులు కాలనీ వాసులతో కలసి గ్రూపు లుగా ఏర్పడి ప్రతి విధి రోడ్లను శుభ్రపరచాలని స్వచ్ఛందంగ కార్యక్రమాన్ని చేయబోతున్నామని ఆదివారం ఉదయం 7:30 గంటల నుండి 11:00 వరకు శివాజీ చౌక్, పద్మశ్రీ హిల్స్, బండ్లగూడ జాగీర్ 121 సర్కిల్ లో స్వచ్ఛత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వివిధ కాలని వాసులకు వారు పిలుపు నిచ్చారు..





ఘనంగా జీడిమెట్లలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, సిటీ టైమ్స్:

జీడిమెట్లలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలి అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆకాంక్షించారు. శనివారం జీడిమెట్లలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ గ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు కృపా కటాక్షాలు, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు...అనంతరం ఆలయంలో ఉన్నటువంటి ఆ పరమశివుడు నీ ఆంజనేయ స్వామి వారినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ ని శాలువాతో సత్కరించి ఆ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్షలాదిమంది రైతన్నలను "భట్టి"బడ్జెట్ వెన్నుపోటు పొడిచింది?

- ఆగ్రహంతో ఉన్న రైతన్నలకు
- ఈబడ్జెట్ లో పెద్దపీట ఎందుకు వేయలేదు?
- "గర్జన"సదస్సులో బడ్జెట్ పై చర్చలుచేస్తాం!
- ప్రజాసంఘాలసమాఖ్య జాతీయఅధ్యక్షులు"పోలాడి" ఆగ్రహం!

హుజూరాబాద్ మార్చ్ 22
సిటీటైమ్స్ ప్రత్యేకప్రతినిధి



రేవంత్ సర్కార్ తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకోవడం తప్ప వారిని ఆదుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చ దం లేదని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, ఉపాధ్యక్షుడు పెండ్యాల రాంరెడ్డి ఆరోపించారు.శనివారం హు జూరాబాద్ లో రైతు ప్రజాసంఘాల రాష్ట్ర ఉమ్మడి జిల్లా నాయకుల తో కలిసి విలేకర్ల తో మాట్లాడుతూ పోలాడి రామారావు, పెండ్యాల రాంరెడ్డి రైతులకు ఇచ్చిన చాలా హామీలను బడ్జెట్ లో కనీసం ప్రస్తా వించలేదని ముఖ్యంగా కౌలు రైతులకు ఇచ్చిన హామీలను శుక్రవారం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ఊసే లేదని, రెండు లక్షల పూర్తి స్థాయి రు ణమాఫీకి నిధులకేటాయింపు ప్రస్తావనే చేయలేదని, అన్నిరకాల వరిదాన్యానికి క్వింటాల్ కు 500 బోనస్ ఇస్తామని ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీలో కేవలం సన్నరకాలకు మాత్రమే బోనస్ అని మిగతా దొడ్డు రకం ధాన్యాన్ని విస్మరించి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డా రు. వ్యవసాయ రంగానికి తగిన రీతిలో నిధులు కే టాయించలేదని గత 3 సార్ల బడ్జెట్ లో రైతు భరోసా కింద కేటాయించిన నిధులు పక్కదారి పట్టించి 3 సార్లు ఎగ్గొట్టరని ఘాటుగా విమర్శించారు. గతేడాది నామ మాత్రంగానే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం దానికి బడ్జెట్ లో నిధుల కేటాయించక రేవంత్ సర్కార్ దారుణంగా వంచనకు గురి చేసిందని నేటికీ పాలక మండలి ఏర్పాటు చేయలేద ని రామారావు, రాంరెడ్డి లు ఆరోపించారు. మిగతా ఓసి కార్పొరేషన్ల కు కూడా నిధుల ప్రస్తావనే లేద న్నారు. ఇందుకు నిరసనగా అసెంబ్లీ సమావేశాల ముగిసే లోపు ఓసి జేఏసీ ఆధ్వర్యంలో అసెంబ్లీ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి నిరసన తెలుపుతామ ని పోలాడి రామారావు పెండ్యాల రాంరెడ్డి తెలిపారు. గతంలో ఇచ్చిన హామీల మేరకు రైతులు పండించిన పంటలకు క్వింటాల్ కు 3 వేల రూపాయలు చొప్పున చెల్లింపులు చేయాలనీ సన్న దొడ్డు వడ్లకు ఇచ్చిన హామీ మేరకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ పంటల కొనుగోళ్ల సమయం లోనే చెల్లించాలని డిమాండ్ చేశారు కౌలు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని , రైతు భరోసా నిడుదలను పంటల సాగు సమయంలోనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండులక్షల రుణ మాఫీ పూర్తి గా అమలు చేయాలని, రైతు భీమా పయోపరిమితిని 70 ఏళ్లకు పెంచాలని,50 ఏళ్లు నిండిన రైతులందరికి నెలకు ఆరు వేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాల ని ఇతర డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఏప్రిల్ 28న ఓసి ఐకాస, రైతు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్ లో లక్ష మందితో ఓసి జేఏసీ ఉపాధ్యక్షు డు పెండ్యాల రాంరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి రైతు మహాగర్జన సమర భేరి సభ నిర్వహించనున్నట్లు పోలాడిరామారావు ప్రకటించారు.ఈ సమావేశం లో ఉమ్మడి జిల్లా ఓసి జేఏసీ అధ్యక్షుడు జూన్నూతుల రాజిరెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఏనుగు చొక్కా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దడిగల వెంకటేశ్వర్ రావు, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ అయిత నాగరాజు, నాయకులు పీచర మనోహర్ రావు, వెన్నమనేని విక్రమ సింహా రావు, రాచమడుగు నరసింహా రావు, మనోహర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటైనా అమలైందా?



- ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత చేయాలి
- మేం ప్రైవేటు బిల్లు పెట్టాలని నిర్ణయించాం


హైదరాబాద్, సిటీ టైమ్స్

కాంగ్రెస్ ప్రభుత్వం 4 కోట్ల మందికి టోపీ పెట్టిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం రోజున 6 గ్యారంటీల దస్త్రంపై సంతకం చేశారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అభయహస్తం దస్త్రంపై సీఎం తొలి సంతకం చేశారన్నారు. గవర్నర్ ప్రసంగంలోనూ ఆరు గ్యారంటీలపై సంతకం జరిగిందని చెప్పించారన్నారు. ''ఆరు గ్యారంటీల్లో అర గ్యారంటీ కూడా ఇప్పటివరకు అమలు కాలేదు. సీఎం సంతకం చేసిన దస్త్రం కనిపించకుండా పోయింది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టనున్నాం. వచ్చే శుక్రవారం నాడు శాసనసభలో మేం ప్రైవేటు బిల్లు పెట్టాలని నిర్ణయించాం. అందుకు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నాం. కాంగ్రెస్ హామీ ఇచ్చిన అంశమే కాబట్టి ఆ పార్టీ కూడా బిల్లుకు మద్దతు ఇవ్వాలి. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు.. వెంటనే అమలు చేయాలి. పింఛను రూ.2వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామన్నారు.. వెంటనే పెంచాలి. విద్యార్థులకు విద్యాభరోసా కార్డులు ఇస్తామన్నారు.. వెంటనే ఇవ్వాలి. కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామన్నారు.. అదీ అమలు చేయాలి. మేం పెట్టే బిల్లు పాస్ అయితే, హామీలన్నీ చట్టప్రకారంగా అమలవుతాయి'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో
నిందితుల ఫొటోలు

సుప్రీం కోర్టు ఆందోళన

న్యూఢిల్లీ, సిటీ టైమ్స్



మొబైల్ ఫోన్లలో చిత్రీకరించిన వీడియోలను ప్రజలు వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేసే ధోరణిని సుప్రీంకోర్టు తప్పపట్టింది. అలాంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. నిందితుల వీడియోలు, ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి, ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో ఒక వ్యాజ్యం దాఖలైంది. ఒక కేసు విషయంలో పోలీసుల మీడియా బ్రీఫింగ్‌పై మార్గదర్శకాలు రూపొందించాలని అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే రాష్ట్రాలను ఆదేశించింది. అందులో సోషల్ మీడియాను కూడా చేర్చాలని పిటిషన్ కోరారు.ఈ పిల్‌పై జరిగిన విచారణలో భాగంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంకెళ్లు వేసిన, తాళ్లతో బంధించిన, మోకాళ్లపై కూర్చోబెట్టిన నిందితుల ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాలో షేర్ చేయడం ఆ వ్యక్తి గౌరవానికి భంగం కలిగించడమే అవుతుందని, అది ప్రజల ఆలోచనను ప్రభావితం చేస్తుందని పేర్కొంది. ''నిబంధనల ద్వారా పోలీసులను నియంత్రించడానికి వీలు ఉంటుంది. కానీ సోషల్ మీడియా, ప్రజల సంగతేంటి..? వారిని నియంత్రించగలమా..?'' అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై విస్తృత పరిశీలన అవసరం అని అభిప్రాయపడింది.

వనపర్తి జిల్లాకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేసిన బిజెపి ప్రభుత్వం

- ప్రధాని నరేంద్ర మోదీ కి ప్రత్యేక కృతజ్ఞతలు..
- పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి...
- వనపర్తి 30 వ వార్డు బీజేపీ నాయకులు నక్క మహేష్ యాదవ్...

వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ మార్చి 21



వనపర్తి జిల్లాను విద్యలో మరింత అగ్రగామిగా ని లబెట్టేందుకు కేంద్రంలోని తమ బిజెపి ప్రభుత్వం జిల్లాకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేసిందని ఇందుకు గాను ప్రధాని నరేంద్ర మోడీ కి తెలంగాణలోని బిజెపి నాయకులకు ప్రత్యేక కృత జ్ఞతలు తెలుపుతున్నట్లు వనపర్తి బిజెపి నాయకులు 30 వ వార్డు బిజెపి కౌన్సిలర్ కాంటెస్టెడ్ అభ్యర్థి నక్క మహేష్ యాదవ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతా ల్లోని పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కేంద్రీయ విద్యాలయంలో తమ పిల్లలను చేర్పించి వారికి ఉజ్వల భవిష్యత్తును అందివ్వాలని నక్క మహేష్ యాదవ్ ఒక ప్రకటన లో పిలుపునిచ్చారు.. వనపర్తి జిల్లా, నాగవరంశివా ర్ ప్రాంతంలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం ప్రా రంభించబడినదని తెలియజేయడం ఆనందంగా ఉందన్నారు ఈ విద్యాసంస్థలో ప్రస్తుత విద్యా సంవ త్సరానికి బాలవాటిక-1, బాలవాటిక-2, బాలవా టిక-3 తరగతులు మరియు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రవేశాల వివరాలు:

బాలవాటిక (1–3) మరియు 1వ తరగతి కోసం అభ్యర్థనలు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించబడతాయి.

దరఖాస్తు చేసుకునేందుకు ఈ లింక్‌ను వినియోగించాలి: https://admission.kvs.gov.in/screen/home

2వ, 3వ, 4వ మరియు 5వ తరగతులు కోసం ప్రవేశాలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించబడతాయి.

ఆసక్తి గల తల్లిదండ్రులు/అభ్యర్థులు పాఠశాల తాత్కాలిక ప్రాంగణం (YTC భవనం), నాగవరంశివార్, వనపర్తి వద్ద పని దినాలలో సంప్రదించాలి.

తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయంలో చేర్పించాలని మహేష్ యాదవ్ తెలిపారు..

ఇరాన్ అణు కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు



న్యూఢిల్లీ, సిటీ టైమ్స్

మధ్యప్రాచ్యంలో యుద్ధం మరో ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఇరాన్‌లోని అత్యంత కీల కమైన 'నటాంజ్' యురేనియం శుద్ధి కేంద్రంపై శనివారం అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. ఇరాన్ అణు సామర్థ్యా న్ని దెబ్బతీయడమే లక్ష్యంగా సాగిన ఈ ఆపరేషన్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీ సింది. అయితే, అణు ప్రమాదం సంభవిస్తుందని ఆందోళన చెందిన వారికి ఊరటనిస్తూ.. అక్కడ రేడియేషన్ ముప్పు లేదని అంతర్జాతీయ సంస్థలు ప్రకటించాయి.

నటాంజ్ అణు కేంద్రంపై దాడి జరిగిన విషయాన్ని ఇరాన్ ప్రభుత్వం తమకు అధికారికంగా తెలియజే సిందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ పేర్కొంది. ఈ మేరకు 'X' (గతంలో ట్విట్టర్) వేదికగా స్పంది స్తూ: "నటాంజ్ అణు కేంద్రంపై ఈరోజు దాడి జరి గినట్లు ఇరాన్ నుంచి మాకు సమాచారం అందింది. అయితే, ఆ ప్రాంతంలో రేడియేషన్ స్థాయిల్లో ఎలాంటి పెరుగుదల నమోదు కాలేదు. ప్రస్తుతం మేము ఈ నివేదికను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం" అని IAEA తెలిపింది. అణు ప్రమాదాలు జరగకుం డా ఉండేందుకు ఇరు పక్షాలు సైనిక సంయమనం పాటించాలని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ రాఫెల్ మారియానో గ్రోస్సీ విజ్ఞప్తి చేశారు. కాగా, అమెరికా, 'దురాక్రమణ దారులైన జియోనిస్ట్ పాలన' (ఇజ్రా యెల్) తమ దేశంపై నేరపూరిత దాడులకు పాల్ప డ్డాయని ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఆరోపించింది.

నటాంజ్ కేంద్రం ఎందుకు ముఖ్యం?

టెహ్రాన్‌కు ఆగ్నేయంగా సుమారు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న నటాంజ్, ఇరాన్ యొక్క ప్రధాన యురేనియం శుద్ధి కేంద్రం. గతంలో 2025 జూన్‌లో జరిగిన 12 రోజుల ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధ సమయంలో కూడా ఈ కేంద్రం లక్ష్యంగా దాడులు జరిగాయి. తాజా దాడుల్లో అణు కేంద్రంలో ని పలు నిర్మాణాలు దెబ్బతిన్నట్లు శాటిలైట్ చిత్రాల ద్వారా తెలుస్తోంది.

ముందున్నది ముసళ్ల పండుగ: ఇజ్రాయెల్

అణు కేంద్రంపై దాడి జరగడానికి కొన్ని గంటల ముందే ఇజ్రాయెల్ రక్షణ మంత్రి 'ఇజ్రాయెల్ కాట్జ్' ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. వచ్చే వారం నుంచి ఇరాన్ పాలకులపై దాడుల తీవ్రత గణనీయంగా పెరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఇటీవల టెల్ అవీవ్ సమీపంలోని ఒక ఖాళీగా ఉన్న కిండర్ గార్టెన్ స్కూల్‌పై ఇరాన్ మిస్సైల్ శకలాలు పడటం గమనార్హం. దీనికి ప్రతీ కారంగానే దాడులు ఉధృతం చేస్తున్నట్లు ఇజ్రాయె ల్ సంకేతాలిచ్చింది.

ట్రంప్ వైఖరిపై సందిగ్ధత

మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్ర కటనలు గందరగోళానికి దారితీస్తున్నాయి. మధ్య ప్రాచ్యంలో సైనిక చర్యలను తగ్గించాలని తాను యోచిస్తున్నట్లు శుక్రవారం ఆయన పేర్కొన్నారు. అయితే, అదే సమయంలో మరో 2,500 మంది మెరైన్ సైనికులను, యుద్ధ నౌకలను ఆ ప్రాంతానికి పంపడం గమనార్హం. అమెరికా లక్ష్యం ఇరాన్ పాల కులను గద్దె దించడమా లేదా వారి అణు సామర్థ్యా న్ని నాశనం చేయడమా అనే విషయంలో స్పష్టత లో పించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

భార్యను పనిమనిషిలా చూడొద్దు

న్యూఢిల్లీ, సిటీ టైమ్స్

ఒకప్పుడు ఆడవాళ్లంటే ఇంటికే పరిమితం అనే భావన ఉండేది. కానీ ఇప్పుడు కాలం మారింది. అన్నింటిలో సగ భాగం అంటూ మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్లిపోతున్నారు. ఇలాంటి తరుణంలో ఉద్యోగం.. ఇంటి పనులు అన్ని మహిళలపైనే మోపితే కుదరదు. తాజాగా ఇలాంటి కేసులో దేశ సర్వోన్నత న్యాయస్థానం ఓ భర్తకు క్లాస్ పీకింది.

ఇంట్లో పనుల విషయంలో భార్య క్రూరంగా ప్రవర్తిస్తోందని ఆరోపిస్తూ ఓ భర్త విడాకులు కోరగా కింది కోర్టు మంజూరు చేసింది. అనంతరం కర్ణాటక హైకోర్టు.. కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వును రద్దు చేసింది. అటు తర్వాత హైకోర్టు ఉత్తర్వును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు.

తాజాగా పిటిషన్ సుప్రీం కోర్టులో విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. ఇరుపక్షాల మధ్య మధ్యవర్తిత్వం విఫలమైందని తెలిపాడు. భార్యాభర్తలిద్దరూ ఉపాధ్యాయులు అని.. వీరికి 2017లో వివాహం జరిగిందని.. 2019 నుంచి విడిగా నివసిస్తున్నారని తెలిపాడు. భార్య క్రూరత్వం కారణంగా బాధితుడు కింది కోర్టులో



విడాకులు కోరగా.. మంజూరు చేసిందని.. అనంతరం కర్ణాటక హైకోర్టు రద్దు చేయడంతో తిరిగి సుప్రంకోర్టుకు వచ్చినట్లు పేర్కొన్నాడు. తన క్లయింట్ విడాకులు కోరుకుంటున్నాడని తెలియజేశాడు. దీంతో సుప్రీం ధర్మాసనం.. భార్య క్రూరత్వం ఏమిటి? అని ప్రశ్నించింది. దీంతో ఇంటిలో పనులు చేయకుండా.. వంట చేయకుండా ఇబ్బంది పెడుతోందని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నాడు.

దీంతో జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పిటిషనర్‌కు ఓ రేంజ్‌లో క్లాస్ పీకింది. ''వంట చేయడం, శుభ్రపరచడం, బట్టలు ఉతకడం భార్య ఒక్కదానికి సంబంధించింది కాదని.. ప్రస్తుతం కాలం మారిందని.. అన్ని పనుల్లో భార్యతో పాటు భర్తలు కూడా పాలుపంచుకోవాల్సిందే. అయినా మీరు ఒక పని మనిషిని పెళ్లి చేసుకోలేదు. ఒక జీవిత భాగస్వామిని పెళ్లి చేసుకున్నారు. భార్య అనుచితంగా ప్రవర్తించిందని.. వంట చేయలేదని విడాకులు కోరడమేంటి?'' అని పిటిషనర్‌ను సుప్రీం కోర్టు తీవ్రంగా మందలించింది.

''భార్యాభర్తలు అన్నాక అన్ని పనుల్లో భర్తలు సహాయం చేయాలి. వంట, బట్టలు ఉతకడం ఇలా అన్ని పనుల్లో భర్త సహకరించాలి. వివాహం అనేది జీవిత భాగస్వాముల కోసం కాబట్టి ఇంటి పనుల్లో భర్త తన భార్యకు సమానంగా సహాయం చేయాల్సిందే. వంట చేయడానికి లేదా ఇంటి పనులు చేయడానికి భార్య నిరాకరించడాన్ని మానసిక క్రూరత్వానికి కారణంగా పరిగణించలేం.'' అని సుప్రీం కోర్టు పేర్కొంది. తదుపరి విచారణకు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులిద్దరూ రావాలని న్యాయస్థానం పేర్కొంది. దీంతో తదుపరి విచారణ ఏప్రిల్ 27కు వాయిదా వేసింది.

ఆ కథనాలు చూస్తే బాధేస్తోంది

- ఆడపిల్లలను మోసం చేస్తున్న ఘటనలు
- ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిలింగ్

హైదరాబాద్, సిటీ టైమ్స్



నేటి స్మార్ట్ ప్రపంచంలో అన్నింటికీ ఆధారం సెల్‌ఫోనే. ఉదయం లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకూ అదే వ్యాపకం. ఆ వ్యాపకం కాస్తా కొందరిలో శ్రుతి మించి వ్యసనంగా మారిపోయింది. ఈ క్రమంలోనే కొంతమంది ఏం చేస్తున్నామనే దానిపై క్లారిటీ లేకుండా తప్పటడుగులు వేస్తున్నారు. ఆనక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులలో ఆన్‌లైన్ ద్వారా జరిగే మోసాలపై అమ్మాయిలను మరోసారి అప్రమత్తం చేశారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్. అందమైన అబ్బాయిలు, సినీ నటుల ఫోటోలను డీపీలుగా పెట్టుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని.. అమ్మాయిలపై బ్లాక్ మెయిలింగ్‌కు దిగుతున్నారని వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇలాంటి వారి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలంటూ ఎక్స్ వేదికగా ఆడపిల్లలకు పలు సూచనలు చేశారు.

అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్‌ఫోన్.. ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోందన్నారు సజ్జనార్. సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత అపరిచిత వ్యక్తులతో ఆడపిల్లలకు ఏర్పడుతున్న పరిచయాలు.. వారిని ఊహించని ప్రమాదాల్లోకి నెట్టేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో ఈ తరహా విషాదకర ఘటనలు తన దృష్టికి ఎక్కువగా వస్తున్నాయని.. ఆ కథనాలు చూసిన తర్వాత ఎంతో బాధగా అనిపిస్తోందని ఎమోషనల్ అయ్యారు.

సైబర్ నేరగాళ్లు సినీ నటులు, అందమైన యువకులు ఫోటోలను డీపీలుగా పెట్టుకుని.. నకిలీ ఖాతాలతో అమ్మాయిలను మోసం చేసేందుకు యత్నిస్తున్నారని సజ్జనార్ హెచ్చరించారు. ఇలాంటి ఫేక్ ఖాతాలతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాలలో అమ్మాయిలకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతారని.. ఆ మాయమాటలకు ఆకర్షితులై కొంతమంది ఆడపిల్లలు మోసపోతున్నారని సజ్జనార్ వివరించారు.

ఇలాంటి అపరిచితులను గుడ్డిగా నమ్మికొంతమంది అమ్మాయిలు.. తమ వ్యక్తిగత ఫోటోలను, వీడియోలను వారితో పంచుకుంటున్నారని.. అలా పంపిన తర్వాత అవతలి వ్యక్తి.. వాటిని అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని సజ్జనార్ వివరించారు. అలా సంపాదించిన అమ్మాయిల ఫోటోలను మార్ఫింగ్ చేసి.. సైబర్ నేరగాళ్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని.. మరికొందరు భౌతికంగా కలవాలని వేధిస్తున్న ఘటనలు తన దృష్టికి వస్తున్నాయని సజ్జనార్ పేర్కొన్నారు.

పరువు పోతుందనే భయంతో, ఇంట్లో చెప్పలేక కొంతమంది అమ్మాయిలు అడిగినంత డబ్బులు ఇస్తున్నారని.. మరికొందరు వేధింపులు భరించలేక తమ ప్రాణాలను సైతం తీసుకుంటున్నారని సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు. మీకు ఇలాంటి సమస్య ఎదురైతే భయపడవద్దని.. సైబర్ నేరగాళ్ల బ్లాక్ మెయిలింగ్‌కు లొంగవద్దని అమ్మాయిలకు సూచించారు. ఈ విషయాన్ని వెంటనే తల్లిదండ్రులకు లేదా స్నేహితులకు చెప్పాలని.. దయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలతో గడపాలని.. ఆన్‌లైన్‌లో వారు ఏం చేస్తున్నారనే దానిని ఓ కంట కనిపెట్టుకుని ఉండాలని సూచించారు. ఇదే క్రమంలో సైబర్ నేరగాళ్లకు సజ్జనార్ వార్నింగ్ ఇచ్చారు. ఫేక్ ప్రొఫైల్స్, ఫేక్ నెంబర్లు, వీపీఎన్‌లు వాడితే చిక్కమని భ్రమపడవద్దని.. మీరు ఎక్కడున్నా పట్టుకొచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మైనారిటీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, సిటీ టైమ్స్:
సహనం సోదరభావానికి ప్రతీక అయిన రంజాన్ పండుగతో ప్రజలు అంతా సుఖసంతోషాలతో ఉండాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. శనివారం పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు కాలనీలలో ముస్లిం మైనారిటీ సోదరుల ఆహ్వానం మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర ఈద్ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సహోదర భావం మరింత బలపడాలని కోరుకున్నారు.

"మా నాన్న మోడీ చెబితేనే వింటారు"

- ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్‌పై స్పందించిన ప్రధాని
- ప్రజలకు కీలక విజ్ఞప్తి!

న్యూఢిల్లీ, సిటీ టైమ్స్

దేశ ప్రజల ఆరోగ్యంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలక సందేశం ఇచ్చారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ యువరాజ్ దువా రూపొందించిన ఒక రీల్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ చక్కెర వినియోగాన్ని తగ్గించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ప్రాముఖ్యతను వివరించారు. ప్రజలు చక్కెర వినియోగాన్ని తగ్గించుకోవాలని కోరారు. వాస్తవానికి.. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అయిన యువరాజ్ దువా సరదాగా ఒక రీల్ చేశాడు. తన తండ్రికి మోడీ అంటే ఎంతో ఇష్టమని, ప్రధాని మోడీ చెబితే ఏం అయినా చేస్తారని చెప్పాడు. మోడీకి ఒక రిక్వెస్ట్ చేశాడు. యువరాజ్ తండ్రికి షుగర్ ఉందట. అయినా స్వీట్లు తినడం ఆపడం లేదట. తన కుటుంబీకులు ఎవ్వరు చెప్పినా వినడం లేదట. ప్రధాని మోడీ మాటలను మాత్రమే నా తండ్రి వింటారని యువరాజ్ అన్నాడు. అందుకే ప్రధాని మోడీకి ఒక అభ్యర్థన చేశాడు. దయ చేసి నెక్స్ట్ మన్ కీ బాత్ కార్యక్రమంలో షుగర్ కంట్రోల్ గురించి మాట్లాడండి. మీరు చెబితే మా నాన్న తప్పకుండా వింటారని యువరాజ్ పేర్కొన్నాడు.


ఇక ఈ వీడియోపై ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోడీ స్పందించారు. యువరాజ్ దువాకి సంబంధించి వీడియోను స్టోరీలో షేర్ చేశారు. యువరాజ్ తండ్రితో పాటు దేశప్రజలందరూ చక్కెర వినియోగాన్ని తగ్గించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. అధిక చక్కెర వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరిస్తూనే, ప్రతిరోజూ యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలని మోడీ సూచించారు. "మీ శ్రేయస్సుపై దృష్టి పెట్టండి. బాగా తినండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి. అధిక చక్కెర అనేక రకాల వ్యాధులకు కారణమవుతుంది. ఊబకాయం ముప్పు కూడా పెరుగుతుంది. అలాగే, యోగాను మీ జీవితంలో ఒక భాగంగా చేసుకోండి. ఆరోగ్యంగా, చురుకుగా ఉండటానికి ఇది ఒక గొప్ప మార్గం." అని ప్రధాని పేర్కొన్నారు. ఇక ప్రధాని సందేశం ఒక్కసారిగా వైరల్ అయ్యింది. ప్రధాని తన వీడియోను షేర్ చేయడం పట్ల యువరాజ్ దువా ఆనందాన్ని వ్యక్తం చేశాడు. తన వీడియో ప్రధాని మోడీ వరకు చేరుతుందని అనుకోలేదన్నాడు.

భారీగా పెరిగిన చికెన్ ధరలు

- గొర్రెల సంఖ్యలో దేశంలోనే తెలంగాణ ఫస్ట్
- కోళ్ల పెంపకంలో మూడో స్థానంలో నిలిచింది
- రంజాన్ సీజన్, ఎండల తీవ్రతే కారణం

హైదరాబాద్, సిటీ టైమ్స్

తెలంగాణ ప్రజలకు ముక్కలేనిదే ముద్ద దిగదు. కొందరు నాన్‌వెజ్‌కు దూరంగా ఉన్నా.. చాలా వరకు మాంసం తినేందుకు ఇష్టపడుతుంటారు. అయితే చికెన్ తినేవారికి నిజంగా ఇది చేదువార్తే అని చెప్పాలి. ఎందుకంటే చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. రంజాన్ పర్వదినం సందర్భంగా చికెన్‌కు గిరాకీ ఏర్పడటంతో ధరలు పెరిగినట్లు వ్యాపారుల చెబుతున్నారు. నిన్నటి వరకూ కేజీ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.320 వరకు ఉండగా ఈరోజు ఏకంగా రూ. 30 వరకు పెరిగింది. హైదరాబాద్ నగరంలో నేడు కిలో చికెన్ ధర రూ.340350 మధ్య పలుకుతోంది. ఇక నాటుకోడి ధరలు అయితే భారీగా పెరిగాయి. కేజీ ధర రూ.800 వరకూ చెబుతున్నారు.ఎండల తీవ్రతకు కోళ్లు మృత్యువాత పడటంతో డిమాండ్ తగిన విధంగా సప్లయ్ లేకపోవటంతో చికెన్ ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం రంజాన్ మాసం కావటం, హలీల్, ఇతర వంటకాల కారణంగా చికెన్ వినియోగం పెరిగిందని అంటున్నారు. అలాగే వివాహాలు, ఇతర శుభకార్యాల సీజన్ కావడంతో చికెన్‌కు డిమాండ్ విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు. రవాణా ఖర్చులు పెరగడం, కోళ్ల దానా ధరలు పెరగటం కూడా ఈ పరిస్థితికి కారణం అంటున్నారు. కేజీ చికెన్ ధరలు దాదాపు అరకిలో మటన్ రేటుకు చేరువవుతుండటంతో చాలామంది వినియోగదారులు చేపలు వంటివి కొనుగోలు చేస్తున్నారు. ఇక తెలంగాణలో మాంసాహార ప్రియుల సంఖ్యతో పాటు ఉత్పత్తి కూడా రికార్డు స్థాయిలో పెరుగుతోంది. తాజాగా రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించే 'తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక 2026'లో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. 201314 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మాంసం వినియోగం కేవలం 2.30 లక్షల టన్నులుగా ఉండగా.. 202425 నాటికి అది ఏకంగా 11.01 లక్షల టన్నులకు చేరుకుందని నివేదికలో వెల్లడైంది. పశుసంపద విషయంలోనూ మన రాష్ట్రం దేశవ్యాప్తంగా తన ప్రత్యేకతను చాటుకుంటోంది. గొర్రెల సంఖ్య విషయంలో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో నిలిచింది. అలాగే కోళ్ల పెంపకం, వినియోగంలో రాష్ట్రం దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. 2019 గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం 3.26 కోట్లకు పైగా పశుసంపద ఉంది. పదేళ్ల క్రితం 1,006 కోట్లుగా ఉన్న గుడ్ల వినియోగం తాజాగా 1,935.26 కోట్లకు పెరిగింది. పాల వినియోగం 39.24 లక్షల టన్నుల నుంచి 59.35 లక్షల టన్నులకు పెరిగింది.



పైలెట్ రోహిత్ రెడ్డికి షాక్!

- లగ్జరీ కార్లు సీజ్.. విచారణ వేగవంతం
- ఫామ్ హౌస్ సీజ్‌కు సిద్ధమవుతున్న అధికారులు

హైదరాబాద్, సిటీ టైమ్స్

మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది.

ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది. అక్కడికి పార్టీ కోసం వచ్చిన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు లగ్జరీ కార్లను (డిఫెండర్, వోల్వో, ఫోక్స్ వ్యాగన్, బెంజ్, రేంజ్ రోవర్) సీజ్ చేసి, ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే ఈ ఫామ్ హౌస్ సీజ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.



అమ్మ బాబోయ్ సమోసాలు

జియాగూడలో కల్తీ సమోసాల గుట్టురట్టు

హైదరాబాద్; సిటీ టైమ్స్

హైదరాబాద్ బిర్యానీ ఎంత ఫేమస్సో.. ఇరానీ చాయ్, వేడివేడి సమోసా అంతే ఫేమస్. నగరవాసులు గరం గరం చాయ్‌తో పాటు వేడి వేడి సమోసాలను అమితంగా ఇష్టపడతారు. అయితే మీరు ఎంతో ఇష్టంగా ఆరగించే ఆ సమోసాలు ఎక్కడ తయారవుతున్నాయి ? వాటిలో వాడే పదార్థాలు ఎంతవరకు సురక్షితం ? అని ఎప్పుడైనా ఆలోచించారా ? జియాగూడలో ఒక సమోసా తయారీ కేంద్రాన్ని చూస్తే మీరు అవాక్కవ్వడమే కాదు.. ఆ దృశ్యాలు చూస్తే 'యాక్.. తూ' అనకుండా ఉండలేరు. అపరిశుభ్రమైన వాతావరణం, కుళ్లిన పదార్థాలు, ప్రాణాలు తీసే కల్తీ నూనెతో తయారవుతున్న ఈ సమోసాల గుట్టును టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు.

కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలోని జియాగూడలో ఎటువంటి అనుమతులు లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో సాగుతున్న ఒక భారీ సమోసా తయారీ యూనిట్ పై హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ , టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి గత కొంతకాలంగా ఈ కేంద్రాన్ని నిర్వహిస్తుండగా.. విచారణలో తెలిసిన విషయాలు అధికారులను సైతం విస్మయానికి గురిచేశాయి. ఈ యూనిట్‌కు ఎటువంటి FSSAI లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్ లేదు. సమోసాల తయారీకి కుళ్లిన ఉడికించిన కోడిగుడ్లు, నాణ్యత లేని స్వీట్ కార్న్, నాసిరకం మైదా పిండిని వాడుతున్నట్లు గుర్తించారు. ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమైన రీతిలో పదే పదే మరిగించిన నూనెనే వాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దాంతో పాటు ఎటువంటి శుభ్రత లేకుండా సమోల మధ్యే నడుస్తూ అక్కడి పనివారు వాటిని తయారు చేయటాన్ని గుర్తించారు.

ఈ దాడిలో రూ.5 లక్షల విలువైన కల్తీ ఆహార పదార్థాలు, యంత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వేల సంఖ్యలో తయారు చేసిన సమోసాలు, మైదా బస్తాలు, స్వీట్ కార్న్, తయారీకి ఉపయోగించే భారీ యంత్రాలు ఉన్నాయి. నిందితుడు అబ్దుల్ రషీద్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేశారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిటీ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆహార పదార్థాల నాణ్యత విషయంలో పౌరులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా కల్తీ జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు.

కాగా, నగరంలో కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు ప్రత్యేకంగా హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ టీమ్‌లో మొత్తం 28 మంది పోలీసులు ఉంటారు. వీరు కేవలం పోలీస్ విభాగానికి మాత్రమే పరిమితం కాకుండా.. ఆహార భద్రతా అధికారులు ఇతర నిపుణులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తారు. ఆహార భద్రతలో తేడాలు కనిపిస్తే 8712661212 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.



సిటీటైమ్స్
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com



మైక్ ఆన్‌లోనే ఉంది గురూ

కోల్‌కతా నైట్‌రైడర్స్ మెంటార్ డ్వేన్ బ్రావో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రధాన కోచ్ అభిషేక్ నాయర్, అసిస్టెంట్ కోచ్ షేన్ వాట్సన్, కెప్టెన్ అజింక్య రహానెతో కలిసి బ్రావో ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చాడు. ఈ క్రమంలో బ్రావో స్పందిస్తూ.. "వీరిద్దరూ నాకు ఫోన్ చేశారు. అప్పుడు నేను ఇద్దరితో ఉన్నా" అని ఏదో చెబుతుండగా.. అజింక్య రహానె వారించాడు. మైక్ ఆన్‌లోనే ఉందని గుర్తుచేశాడు. దీంతో బ్రావో అవాక్కై.. అక్కడితో ఆపేశాడు. అయితే, సోషల్ మీడియాలో బ్రావోపై కొందరు విమర్శలు చేస్తుండగా.. మరికొందరు అతడికి మద్దతుగా నిలిచారు.

"ఐపీఎల్ వంటి మెగా లీగ్‌కు వచ్చినప్పుడు హుందాగా ఉండాలి. మరీ ముఖ్యంగా ప్రెస్ కాన్ఫరెన్స్ సమయంలో మైక్ ఆన్‌లో ఉందా, లేదా అని కూడా చూసుకోరా? ఏం మాట్లాడినా అందుకు సరైన కారణం ఉండాలి. అభిమానులకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉంది"

"ప్రెస్ కాన్ఫరెన్స్‌కు కీలక వ్యక్తులు వచ్చారు. నా ఇంట్లో ఇద్దరు గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారు అని బ్రావో చెప్పాడు. రహానె ఆపకపోయుంటే ఇంకేం మాట్లాడేవాడో? అప్పుడు అతడి ఫేస్ పూర్తిగా మాడిపోయింది. ఐపీఎల్‌కు ఇలాంటి మైండ్‌సెట్‌తో రావడం సిగ్గుచేటు"

"ఎందుకు బ్రావో వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుంటారు. అతడు ఇంటి వద్ద ఇద్దరు మహిళలు ఉన్నారని చెప్పాడు. వారు స్నేహితులు అయి ఉండొచ్చు కదా. కేవలం ఒక్క క్లిప్ ఆధారంగా జడ్జ్‌మెంట్ ఇచ్చేయకూడదు. అయితే ప్రస్తుత, మాజీ క్రికెటర్లు ఎవరైనా సరే ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలి"

"మహిళల గురించి గతంలో ఇలాగే ఓ క్రికెటర్ అనుచితంగా మాట్లాడాడు. తర్వాత సారీ చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకే, పబ్లిక్‌గా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి"

15 ఏళ్ల క్రికెటర్.. ఒక్క సెంచరీతో రికార్డులు బద్దలు

అంతర్జాతీయ మహిళల టీ20లో రువాండా బ్యాటర్ ఫ్యానీ సరికొత్త ఘనత సృష్టించింది. నైజీరియా ఇన్విటేషనల్ మహిళల అంతర్జాతీయ టీ20 టోర్నమెంట్‌లో శుక్రవారం ఘనాతో జరిగిన మ్యాచ్‌లో ఫ్యానీ (111: 65 బంతుల్లో 17 ఫోర్లు) శతకం బాదింది. అంతర్జాతీయ టీ20ల్లో అతిపిన్న వయసులో (15 ఏళ్ల 223 రోజులు) సెంచరీ చేసిన క్రికెటర్‌గా రికార్డ్ నెలకొల్పింది. అంతేకాకుండా మహిళల అంతర్జాతీయ టీ20 చరిత్రలో అరంగేట్రంలోనే సెంచరీ చేసిన తొలి క్రీడాకారిణిగా నిలిచింది.

గతంలో ఉగాండాకు చెందిన ప్రోస్కోవియా అలకో పేరిట ఉన్న రికార్డును ఫ్యానీ అధిగమించింది. అలకో 2019లో మాలీపై 116 పరుగులు చేసింది. అప్పుడు ఆమె వయసు 16 ఏళ్ల 233 రోజులు.

ఇక 2005లో టౌంటన్‌లో ఇంగ్లాండ్‌పై ఆసీస్ మాజీ క్రికెటర్ కారెన్ రోల్టన్ నెలకొల్పిన ఓ రికార్డునూ ఫ్యానీ అధిగమించింది. అరంగేట్ర మ్యాచ్‌లో కారెన్ 96 పరుగులతో అజేయంగా నిలిచింది. ఇప్పుడు సెంచరీతో ఫ్యానీ ఆ రికార్డును బద్దలు కొట్టింది. మహిళల అంతర్జాతీయ టీ20 అరంగేట్రంలో అత్యధిక స్కోరు నమోదు చేసిన బ్యాటర్‌గానూ నిలిచింది.

పురుషుల క్రికెట్‌లో అంతర్జాతీయ టీ20 సెంచరీ రికార్డు అత్యంత పిన్న వయస్కుడైన ఫ్రాన్స్‌కు చెందిన గుస్తావ్ పేరిట ఉంది. 18 ఏళ్ల 280 రోజుల వయసులో అతడు స్విట్జర్లాండ్‌పై సెంచరీ చేసి రికార్డు సృష్టించాడు. దీంతో ఫ్యానీ అంతర్జాతీయంగా తక్కువ వయసులోనే శతకం చేసిన క్రికెటర్‌గా అవతరించింది.మొదట బ్యాటింగ్ చేసిన రువాండా 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో ఘనా కేవలం 88/8 స్కోరుకే పరిమితమై ఓటమి పాలైంది. తన అద్భుతమైన శతక ఇన్నింగ్స్‌కు ఫ్యానీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.



అప్పుడు 7 కిలోలు తగ్గా: శ్రేయస్ అయ్యర్

తనను రూ.26.75 కోట్లకు కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్‌ను ఐపీఎల్ 2025 సీజన్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫైనల్‌కు చేర్చాడు. బ్యాటర్‌గానూ ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆర్సీబీ చేతిలో ఓటమితో రన్నరప్‌గా నిలిచినా.. పంజాబ్ కింగ్స్ పోరాటం మాత్రం అదిరిపోయింది. అయితే, శ్రేయస్‌కు భారత జట్టు తరపున మాత్రం పెద్దగా అవకాశాలు రాలేదు. గాయం వల్ల ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లోనూ చోటు దక్కలేదు. దీంతో తనకు గతేడాది చాలా కష్టంగా గడిచిందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. గాయం వల్ల దాదాపు ఏడు కేజీల బరువు కూడా తగ్గినట్లు తెలిపాడు. గాయం నుంచి కోలుకొని రావడం చాలా కష్టమని వెల్లడించాడు.



"గాయం వల్ల నేను దాదాపు ఏడు కేజీలు బరువు తగ్గా. దాని నుంచి కోలుకొని రావడం పెద్ద సవాల్‌గా నిలిచింది. నాకైన గాయం చాలా ప్రమాదకరమైందే. అయితే, రెండు నెలలు తీవ్రంగా కష్టపడిన తర్వాత.. ఇప్పుడు నా శరీరాకృతి బాగుంది. కానీ, ఫిట్‌గా ఉంటూనే ఏడు కేజీల బరువు పెరగాలంటే చాలా శ్రమించాలి. నాకు సవాళ్లు అంటే చాలా ఇష్టం. తప్పకుండా ఆ పరిస్థితిని అధిగమిస్తా. ఇలాంటివి ఎన్నోసార్లు అనుభవించా. కమ్‌బ్యాక్ చేసి భారత జట్టుకూ ఆడిన రోజులు ఉన్నాయి" అని శ్రేయస్ తెలిపాడు.

అంచనాలు భారీగానే..

"గతేడాది మేం ఫైనల్‌కు వచ్చాం. రన్నరప్‌గా నిలిచాం. దీంతో ఈసారి మాపై భారీగానే అంచనాలు ఉంటాయి. ఎప్పుడు అడుగు వేసినా.. విజయం సాధించేందుకే ప్రయత్నిస్తాం. నా కన్ను ట్రోఫీ పైనే ఉంది. గత రెండు నెలలుగా మేమంతా ఓ కుటుంబంలా కలిసి ఉన్నాం. ఒకరినొకరం అర్థం చేసుకున్నాం. ప్రతి మ్యాచ్‌కు రెండు లేదా మూడు రోజుల ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. మైదానం ఆవల ఉండే బాండింగ్‌తోనే మ్యాచ్‌లో మెరుగ్గా రాణించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది" అని శ్రేయస్ తెలిపాడు.

నా రాజీనామాకు.. జై షాతో సంబంధమే లేదు: శివరామకృష్ణన్

"నన్ను బీసీసీఐ గత 23 ఏళ్లుగా విస్మరించింది. అందుకే, కామెంటేటర్ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నా".. ఇదీ మాజీ క్రికెటర్ శివరామకృష్ణన్ నిన్న చేసిన వ్యాఖ్యలు. దీంతో అతడిని పక్కనపెట్టడం వెనుక బీసీసీఐ కార్యదర్శిగా వ్యవహరించిన జైషా ఉన్నారని సోషల్ మీడియా వేదికగా విమర్శలు వచ్చాయి. ఇప్పుడు వాటన్నింటినీ తోసిపుచ్చుతూ శివరామకృష్ణన్ మరో పోస్టు పెట్టారు. దీని వెనుక బీసీసీఐకి చెందిన ఓ ఉద్యోగి ఉన్నాడని.. మిగతా అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధం లేదని స్పష్టం చేశాడు.

"నా రాజీనామా చిత్రంలోకి బీసీసీఐ అడ్మినిస్ట్రేషన్‌ను తీసుకురావొద్దు. బీసీసీఐలోని ఒకే ఒక్క ఉద్యోగి చేసిన నిర్వాకం ఇది. జైషాతోపాటు ఇతర పెద్దలకు ఇందులో ఎలాంటి పాత్ర లేదు. నా జీవిత పగ్గాలను నా చేతిలోకి తీసుకుంటున్నా. అలా చేసే హక్కు ఉందని భావిస్తున్నా" అని వెల్లడించారు.

శివరామకృష్ణన్ 2000 నుంచి కామెంట్రీ చేయడం మొదలుపెట్టారు. ఐసీసీ క్రికెట్ కమిటీలోనూ ప్రతినిధిగా వ్యవహరించిన అనుభవం ఉంది. అయితే టాస్‌తోపాటు అవార్డుల ప్రజెంటేషన్ కార్యక్రమాల్లో తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీసీసీఐ తనను 23 ఏళ్ల నుంచి నిర్లక్ష్యానికి గురి చేసిందని విమర్శించారు. ఇప్పుడు తాజా కామెంట్లతో భవిష్యత్తులో ఎలాంటి పాత్ర పోషిస్తాడనేది ఆసక్తికరంగా మారింది.



కేకేఆర్‌కు మరో షాక్..

మొన్న హర్షిత్.. ఇప్పుడు ఆకాశ్ దీప్ ఔట్!

ఇప్పటికే హర్షిత్ రాణా రూపంలో ఓ పేసర్‌ను కోల్పోయిన కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మరో షాక్ తగిలింది. గత వేలంలో తీసుకున్న ఆకాశ్ దీప్ కూడా లీగ్‌లో ఆడటం కష్టమేనని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం అతడు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌కు మరో వారం రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో అతడు కోలుకుని వచ్చి ఆడటం కష్టమేనని క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఆకాశ్‌కు గాయాలు కొత్తేమీ కాదు. 2022లో తొలిసారి ఐపీఎల్‌లో అడుగు పెట్టిన అతడు.. ఇప్పటి వరకు ఆడింది కేవలం 14 మ్యాచులే కావడం గమనార్హం. గత ఐపీఎల్‌లో ఆకాశ్‌ను కేకేఆర్ రూ. కోటికే సొంతం చేసుకుంది. ఆకాశ్ దీప్ గైర్హాజరుపై కేకేఆర్ ప్రధాన కోచ్ అభిషేక్ నాయర్ స్పందించలేదు.



కానీ, హర్షిత్ రాణా స్థానంలో మరొకరిని చూస్తామని వెల్లడించాడు. పతిరన వస్తాడు.. కానీ: అభిషేక్

"హర్షత్ రాణా లేకపోవడం మాకు నష్టమే. జట్టులో అతడు కీలక పాత్ర పోషించాడు. గత కొన్ని రోజులుగా మేం ప్రత్యామ్నాయ బౌలర్లను చూస్తూనే ఉన్నాం. ఎవరు సరిపోతారనే దానిపై విశ్లేషిస్తున్నాం. ఇప్పటి వరకైతే మేం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తప్పకుండా ఎవరో ఒకరిని స్క్వాడ్‌లోకి తీసుకుంటాం. ఇక మతీశా పతిరన విషయంలో సమాచారం ఉంది. అతడు ఏప్రిల్ మధ్య వరకూ అందుబాటులో ఉండడు. అప్పటికే మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తాడు" అని అభిషేక్ వెల్లడించాడు. మరోవైపు పతిరనకు ఇంకా శ్రీలంక క్రికెట్ బోర్డు ఎన్ఓసీ ఇవ్వలేదని సమాచారం. ఫిట్‌నెస్ ఆధారంగా జారీ చేసే అవకాశం ఉంది.

19 ఏళ్ల తర్వాత బెల్‌ఫాస్ట్‌కు భారత్.. ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్

ఐర్లాండ్‌తో టీమ్‌ఇండియా రెండు టీ20ల సిరీస్‌లలో తలపడనుంది. దాదాపు 19 ఏళ్ల తర్వాత బెల్‌ఫాస్ట్ మైదానంలో భారత జట్టు మ్యాచులు ఆడనుండటం గమనార్హం. ఇంగ్లాండ్ పర్యటనకు ముందే ఐర్లాండ్‌తో టీమ్‌ఇండియా ఈ సిరీస్‌ను ఆడనుంది. టీ20 ప్రపంచ కప్, ఐపీఎల్ తర్వాత భారత్ తొలి విదేశీ పర్యటనకు ఐర్లాండ్ వెళ్లనుంది. ఆ తర్వాత కొద్ది రోజులకే ఇంగ్లాండ్‌తో పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌లను ఆడనుంది. మ్యాచులు ఎప్పుడంటే?

తొలి టీ20 మ్యాచ్: జూన్ 26న
రెండో టీ20 మ్యాచ్: జూన్ 28న

"టీమ్‌ఇండియా సీనియర్ జట్టు రెండు టీ20ల సిరీస్ కోసం ఐర్లాండ్‌కు వెళ్లనుంది. గత ఎనిమిదేళ్లలో భారత్ మూడుసార్లు అక్కడికి పర్యటించింది. 2018, 2022, 2023లో ఐర్లాండ్‌తో మ్యాచులు ఆడింది. అయితే, 2007 తర్వాత బెల్‌ఫాస్ట్ వేదికగా ఇప్పుడే మ్యాచ్‌లను ఆడనుంది" అని బీసీసీఐ వెల్లడించింది. ఐపీఎల్ ముగిశాక.. భారత్ స్వదేశంలోనే అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌ను ఆడనుంది.





కనురెప్పల అలంకరణ రోజంతా చెదరకుండా, చెరిగిపోకుండా ఉండాలంటే 5 చిట్కాలు

కళ్ళకు చక్కగా వేసుకున్న ఐషాడో మీ మొత్తం మేకప్ అందాన్ని పెంచుతుంది. కానీ అది రోజంతా చెక్కుచెదరకుండా ఉంచుకోవడం కష్టం. ఉదయం మీటింగ్‌ల నుండి సాయంత్రం పార్టీల వరకు, ఐ మేకప్ ఎక్కువసేపు ఉండాలంటే సరైన తయారీ, సరైన పద్ధతులు అవసరం. సరైన తయారీతో, మంచి ఉత్పత్తులతో, మీ కళ్ళు ఉదయం నుండి రాత్రి వరకు తాజాగా, లోపాలు లేకుండా కనిపిస్తాయి. మీ ఐషాడో రోజంతా ప్రకాశవంతంగా, ముడతలు లేకుండా, లోపాలు లేకుండా ఉండాలంటే ఈ నిపుణుల సలహాలను పాటించండి.



1. కళ్ళను శుభ్రంగా, సిద్ధంగా ఉంచుకోండి

హౌస్ ఆఫ్ బ్యూటీకి చెందిన నేషనల్ మేకప్ ఆర్టిస్ట్ హితేష్ దేవత్ మాట్లాడుతూ, "ముందుగా మీ కనురెప్పలను శుభ్రంగా కడగాలి. వాటిపై ఉన్న జిడ్డు లేదా ఇతర పదార్థాలు తొలగిపోతాయి. తర్వాత తేలికపాటి, త్వరగా ఇంకిపోయే ఐ క్రీమ్‌ను రాయండి. ఇది జిడ్డుగా లేకుండా చర్మాన్ని తేమగా ఉంచుతుంది. చర్మం మృదువుగా, తేమగా ఉంటే ఐషాడో బాగా అతుక్కుంటుంది, సులభంగా కలుస్తుంది" అని సూచించారు.

ఫ్యాషన్ కలర్‌కు చెందిన మేకప్ నిపుణురాలు ప్రియా సచన్ "ముందుగా కనురెప్పలను శుభ్రంగా, పొడిగా ఉండేలా చూసుకోండి. వాటిపై జిడ్డు లేదా స్కిన్‌కేర్ ఉత్పత్తులు ఉండకూడదు. ఇలా చేస్తే ఐషాడో బాగా అతుక్కుంటుంది, జారిపోదు." అని వివరించారు.

2. ఐషాడో ప్రైమర్ వాడండి

ఐషాడో ఎక్కువసేపు ఉండాలంటే ప్రత్యేకమైన ఐషాడో ప్రైమర్ చాలా ముఖ్యం. "ఇది మృదువైన ఆధారాన్ని సృష్టిస్తుంది. రంగు మరింత



ప్రస్ఫుటంగా కనిపించేలా చేస్తుంది. అలాగే కళ్ళలోంచి వచ్చే సహజ నూనెలు మేకప్‌ను చెదరగొట్టకుండా కాపాడుతుంది. కనురెప్పలపై కొద్ది మొత్తంలో ప్రైమర్‌ను నెమ్మదిగా రాసి, అది ఆరిన తర్వాత ఐషాడో వేయండి." అని హితేష్ వివరించారు. "ఐషాడో ప్రైమర్‌ను పలుచని పొరగా రాయండి. ఈ తేలికపాటి, జిడ్డు లేని ఫార్ములా మృదువైన బేస్‌ను తయారు చేస్తుంది. రంగును మరింత గాఢంగా చేస్తుంది. జిడ్డు కనురెప్పలపై కూడా ముడతలు రాకుండా చూస్తుంది." అని ప్రియా సలహా ఇచ్చారు.

3. ఎక్కువసేపు ఉండే, మంచి రంగునిచ్చే ఐషాడోలను ఎంచుకోండి

"ఎక్కువసేపు ఉండే, మంచి రంగునిచ్చే ఐషాడోలను ఎంచుకోండి. మ్యాట్ లేదా షిమ్మర్ అయినా, మెత్తగా ఉండే పౌడర్‌లు సులభంగా అప్లై అవుతాయి. రాలకుండా చూస్తాయి. దీనివల్ల రంగును బాగా వేయవచ్చు, ఎక్కువసేపు



ఉంటుంది." అని హితేష్ సలహా ఇచ్చారు.

"మంచి రంగునిచ్చే, ఎక్కువసేపు ఉండే ఐషాడోలను ఎంచుకోండి. క్రీమ్ నుండి మ్యాట్ లేదా సాటిన్ రకాలు సాధారణంగా బాగా పట్టుకుంటాయి, చక్కగా కలిసిపోతాయి." అని ప్రియా చెప్పారు.

4. పొరలు పొరలుగా అప్లై చేసి, పౌడర్‌తో సెట్ చేయండి

"ఐషాడో ఎక్కువసేపు ఉండాలంటే, సన్నని పొరలుగా, సమానంగా వేయండి. బ్లెండింగ్ బ్రష్‌తో నెమ్మదిగా రంగు గాఢతను పెంచండి. కావలసిన రంగు వచ్చిన తర్వాత, తటస్థ రంగు పౌడర్ ఐషాడోతో తేలికగా సెట్ చేయండి. ఇది అంతా చెక్కుచెదరకుండా ఉంచుతుంది" అని హితేష్ చెప్పారు.

"ప్రైమర్ తర్వాత, మీ కనురెప్పలపై తటస్థ రంగు మ్యాట్ షాడోను తేలికగా అప్లై చేసి బేస్‌ను సెట్ చేయండి. తర్వాత ప్రధాన ఐషాడో షేడ్స్‌ను నొక్కి, రంగును పెంచండి." అని ప్రియా సూచించారు.

5. పౌడర్ వేసిన కనురెప్పలపై ఇతర రకాల ఉత్పత్తులను వాడకండి

"ఐషాడోను సెట్ చేసిన తర్వాత దానిపై క్రీమ్ లేదా లిక్విడ్ ఉత్పత్తులను వాడకండి. ఎందుకంటే ఇది బేస్‌ను దెబ్బతీసి, ముడతలు లేదా అసమానమైన టెక్స్‌చర్‌కు కారణమవుతుంది. మెరుపు లేదా హైలైట్ కావాలంటే, పొడి ఆధారిత ఫార్ములాస్‌ను ఎంచుకోండి. అప్పుడు ఐషాడో అంతా ఒకేలా, చక్కగా కనిపిస్తుంది.." అని హితేష్ సూచించారు.

"అవసరమైన చోట మాత్రమే, ముఖ్యంగా అంచుల వద్ద మాత్రమే కలపండి. ఎక్కువగా కలపడం వల్ల రంగు తగ్గిపోతుంది. ఎక్కువసేపు ఉండదు. మీ ఐ మేకప్ పూర్తయిన తర్వాత, మీ ముఖంపై తేలికగా సెట్టింగ్ పౌడర్‌ను స్ప్రే చేయండి. చాలా సన్నని సెట్టింగ్ పౌడర్ అదనపు జిడ్డును పీల్చుకుంటుంది. మీ మేకప్‌ను గంటల తరబడి చెక్కుచెదరకుండా ఉంచుతుంది. మీ ఐషాడోకు అది చివరి టచ్.." అని ప్రియా తెలిపారు.

గర్భం తొలి దశలో ప్రమాదాల గురించి ఆందోళన చెందుతున్నారా?



గర్భం దాల్చిన మొదటి మూడు నెలలు (తొలి త్రైమాసికం) చాలా ముఖ్యమైన సమయం. ఈ దశలో చాలా జాగ్రత్తగా, శ్రద్ధగా ఉండాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, సరైన అవగాహన, సమయానికి వైద్య సలహాలు తీసుకోవడం ద్వారా గర్భధారణ సంబంధిత ప్రమాదాలను చాలా వరకు తగ్గించుకోవచ్చు. ముంబై సెంట్రల్‌లోని వోక్‌హార్డ్ హాస్పిటల్స్‌కు చెందిన గైనకాలజీ, ప్రసూతి కన్సల్టెంట్ డాక్టర్ రానా చౌదరి మాట్లాడుతూ, "తొలి త్రైమాసికం అత్యంత సున్నితమైన దశ. కొన్ని ప్రమాద కారకాలు మన నియంత్రణలో లేనప్పటికీ, చాలా వాటిని సరైన విధానంతో సమర్థవంతంగా నిర్వహించవచ్చు" అని తెలిపారు. గర్భం తొలి దశలో ఎదురయ్యే ప్రమాదాలను నివారించడానికి డాక్టర్ రానా చౌదరి కొన్ని చిట్కాలు పంచుకున్నారు.



1. ప్రెగ్నెన్సీ కేర్‌ను ముందుగానే ప్రారంభించండి:

గర్భం నిర్ధారణ అయిన వెంటనే, ప్రసూతి వైద్యుడిని (గైనకాలజిస్ట్) కలవడం ముఖ్యం. ముందుగానే చేసే స్కాన్‌లు, రక్త పరీక్షలు థైరాయిడ్ అసమతుల్యత, మధుమేహం లేదా గర్భధారణను ప్రభావితం చేసే ఇన్ఫెక్షన్‌ల వంటి సమస్యలను గుర్తించడానికి సహాయపడతాయి. సోనోగ్రఫీ ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ (గర్భాశయం వెలుపల పిండం పెరగడం) వంటి సమస్యలను గుర్తించడానికి కూడా ఉపయోగపడుతుంది.

2. ఫోలిక్ యాసిడ్, ప్రినేటల్ విటమిన్‌లకు ప్రాధాన్యత ఇవ్వండి:

గర్భం ధరించడానికి ముందు, గర్భం తొలి దశలో ఫోలిక్ యాసిడ్ తీసుకోవడం వల్ల పిండం వెన్నెముకకు సంబంధించిన లోపాలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. మీ



శరీరానికి అవసరమైన పోషకాలను బట్టి మీ డాక్టర్ ఇతర సప్లిమెంట్లను కూడా సిఫార్సు చేయవచ్చు.

3. హానికరమైన పదార్థాలకు దూరంగా ఉండండి:

పొగాకు, ఆల్కహాల్, మాదక ద్రవ్యాలు, టీ, కాఫీ రూపంలో ఎక్కువ కెఫిన్ తీసుకోవడం వల్ల గర్భస్రావం, పిండం ఎదుగుదలలో సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. వీటిని మొదటి నుంచే మానేయడం చాలా ముఖ్యం.

4. జాగ్రత్తగా ఆహారం తీసుకోండి, హైడ్రేటెడ్‌గా ఉండండి:

ప్రోటీన్, ఐరన్, కాల్షియం, ఫోలేట్ సరైన మోతాదులో ఉండే సమతుల్య ఆహారం తల్లికి, ఎదుగుతున్న పిండానికి పోషణను అందిస్తుంది. శరీరంలో తగినంత నీరు ఉండటం వల్ల రక్త ప్రసరణ, పోషకాల సరఫరా సక్రమంగా జరుగుతాయి.

5. మందుల విషయంలో జాగ్రత్తగా ఉండండి:

స్వీయ వైద్యం (సొంతంగా మందులు తీసుకోవడం) పూర్తిగా మానుకోవాలి. ఎటువంటి ఓవర్-ది-కౌంటర్ మందులు లేదా సప్లిమెంట్లను తీసుకునే ముందు ఎల్లప్పుడూ మీ డాక్టర్‌ను సంప్రదించండి. ఎందుకంటే చాలా మందులు గర్భధారణ సమయంలో సురక్షితం కాకపోవచ్చు.

6. మీ శరీరం చెప్పేది వినండి:

విపరీతమైన అలసట, నొప్పి, రక్తస్రావం లేదా కళ్ళు తిరగడం వంటి లక్షణాలను విస్మరించకూడదు. ఏదైనా అసాధారణ లక్షణాలను సకాలంలో డాక్టర్‌కు తెలియజేయడం వల్ల సమస్యలను నివారించవచ్చు.

7. మానసిక, భావోద్వేగ ఆరోగ్యం:

ఒత్తిడి పరోక్షంగా హార్మోన్ల స్థాయిలను ప్రభావితం చేస్తుంది. విశ్రాంతి తీసుకోవడానికి సమయం కేటాయించడం, మైండ్‌ఫుల్‌నెస్‌ను అభ్యసించడం, అవసరమైనప్పుడు మానసిక మద్దతు పొందడం కూడా అంతే ముఖ్యం. "ఎటువంటి గర్భధారణ పూర్తిగా ప్రమాద రహితం కానప్పటికీ, ముందుగానే, సరైన అవగాహనతో చేసే చర్యలు ఆరోగ్యకరమైన, సురక్షితమైన గర్భధారణకు చాలా సహాయపడతాయి" అని డాక్టర్ హైలైట్ చేశారు.

సిటీటైమ్స్

www.citytimesnews.com

సినిమా ముచ్చట్లు


epaper.citytimesdaily.com

గరివిడి లక్ష్మి స్వరాలు



ఉత్తరాంధ్ర జానపద కళాకారిణి గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్ 'గరివిడి లక్ష్మి'. టైటిల్ రోల్‌ని ఆనంది పోషిస్తున్నది. గౌరీనాయుడు జమ్ము దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ దాదాపు పూర్తి కావచ్చింది. త్వరలోనే సినిమాను విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని, ముఖ్యంగా కొన్ని రోజులు క్రితం విడుదలైన ఇందులోని 'నలజీలకర్ర మొగ్గ..' సాంగ్‌కైతే, సోషల్ మీడియాలో స్పందన ఓ రేంజ్‌లో ఉన్నదని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఇందులోని సెకండ్ సింగిల్‌కి సంబంధించిన అప్‌డేట్‌ని మేకర్స్ అందించారు. 'కోసింది కోయగూర..' అని సాగే ఈ పాటను ఈ నెల 24న విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు.

నోరా ఫతేహీ పై ఫత్వా



కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్' లోని 'సర్కే చునార్ తేరి సర్కే' పాట తీవ్ర వివాదాలకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ముస్లిం పర్సనల్ దారుల్ ఇఫ్తా అనే మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని సదరు సంస్థ పేర్కొంది. ఇటువంటి ప్రదర్శనలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని, ముఖ్యంగా ముస్లిం యువతను తప్పదోవ పట్టిస్తాయని వారు తమ ఫత్వాలో పేర్కొన్నారు. మరోవైపు ఈ పాటకు దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ విషయాన్ని ధృవీకరించారు.మరోవైపు ఈ వివాదంపై నోరా ఫతేహీ స్పందిస్తూ.. ఈ పాట హిందీ వెర్షన్‌లో తనకేమీ సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. మూడేళ్ల క్రితం సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి నటించే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహి ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ సాంగ్ రీమేక్ అని భావించి తాను అంగీకరించానని తెలిపారు. తనకు కన్నడ భాష తెలియదని, మేకర్స్ చెప్పిన అనువాదం అప్పట్లో అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె వివరణ ఇచ్చారు. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో 1970ల నాటి బెంగళూరు నేపథ్యంతో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.

పాతకాలపు ఆలోచనలు పక్కన పెట్టండి

కథకు ప్రాధాన్యతనిచ్చి, ఆ కథలో తన పాత్ర పరిధి ఎంత ఉన్నా.. నటించే జెన్యూన్ హీరోలు నేటికాలంలో లేరని నటి తాప్సీ అన్నారు. ఇటీవలే బాలీవుడ్‌లో హీరోల ఆధిపత్య ధోరణి, అభద్రతాభావంపై తాప్సీ హాట్ హాట్ కామెంట్లు చేశారు. ఇంకా మాట్లాడుతూ 'సినిమాలో తన పాత్ర కంటే హీరోయిన్ పాత్ర ఎక్కువగా ఉందంటే, చిన్నహీరోలు కూడా నటించడానికి వెనకడగు వేస్తున్నారు. కథ ఎంత గొప్పదైనా సరే.. హీరోయిన్ డామినేషన్‌ని మాత్రం వాళ్లు సహించలేరు. ఈ అభద్రతాభావం చాలామంది హీరోలకు ఉంది. తెరపై హీరోయిన్ హైలైట్ అయితే.. తన ఇమేజ్ దెబ్బతింటుందని వారి భావన. ఇలా అయితే.. మంచి కథలు ఎలా వస్తాయి?' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది తాప్సీ పన్ను. 'కేవలం తమ పాత్రలకు మాత్రమే ప్రాధాన్యత ఉండాలి, హీరోయిన్లు పాటలకు మాత్రమే పరిమితం కావాలనే పాతకాలపు ఆలోచనల నుంచి పరిశ్రమ బయటకు రావాలని, నిజాయితీగా కథను ప్రేమించే నటులు ఉంటే వైవిధ్యమైన సినిమాలు వస్తాయని తాప్సీ అభిప్రాయపడింది.

రణ్‌వీర్‌దీపికా మధ్య గొడవలా..

రణవీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన 'ధురంధర్ 2' సినిమా దేశవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. మొదటి భాగం కంటే ఈ సీక్వెల్ మరింత పెద్ద హిట్‌గా నిలుస్తుందనే టాక్ వినిపిస్తోంది. యాక్షన్ సీక్వెన్స్‌లు, స్పై ఎలిమెంట్స్, ఊహించని ట్విస్ట్‌లతో ఈ చిత్రం ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేస్తోంది. థియేటర్లలో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తుండగా, కలెక్షన్ల పరంగా కూడా ఈ సినిమా దూసుకుపోతోంది. టాలీవుడ్, బాలీవుడ్ అనే తేడా లేకుండా దేశవ్యాప్తంగా స్టార్ హీరోలు, సినీ ప్రముఖులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపిస్తున్నారు. అల్లు అర్జున్, రామ్ చరణ్, ఎన్టీఆర్, విజయ్ దేవరకొండ వంటి స్టార్స్ సోషల్ మీడియాలో స్పందిస్తూ 'ధురంధర్ 2' టీమ్‌ను అభినందిస్తున్నారు. దీంతో సినిమా క్రేజ్ మరింత పెరిగింది. అయితే ఈ విజయోత్సాహం మధ్య ఒక విషయం మాత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అదే రణవీర్ సింగ్ భార్య, స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణే సైలెన్స్. సినిమా రిలీజ్‌కు ముందు గానీ, తర్వాత గానీ ఆమె ఎక్కడా 'ధురంధర్ 2' గురించి స్పందించలేదు. సోషల్ మీడియాలో ఒక్క పోస్టు కూడా పెట్టకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో రణవీర్ చిన్న విజయాన్ని సాధించినా కూడా వెంటనే స్పందించే దీపికా, ఇప్పుడు ఈ భారీ బ్లాక్‌బస్టర్‌పై మౌనం పాటించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'ధురంధర్' మొదటి భాగానికి మాత్రమే స్టోరీ పెట్టిన ఆమె, పార్ట్ 2పై మాత్రం ఎలాంటి స్పందన ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో సోషల్ మీడియాలో నెటిజన్లు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. "దీపికా బిజీగా ఉందా?", "లేదా వ్యక్తిగత కారణాల వల్ల స్పందించలేదా?", "ఇద్దరి మధ్య ఏమైనా జరిగిందా?" అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్ మీడియాలో కూడా ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.



వరుస ఫ్లాప్స్ తర్వాత స్పీడ్ పెంచిన నితిన్

టాలీవుడ్ హీరో నితిన్ ప్రస్తుతం తన కెరీర్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయారు. 'చెక్', 'రంగ్ దే', 'మ్యాస్ట్రో', 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి చిత్రాలు ప్రేక్షకులను నిరాశపరచగా, గతేడాది విడుదలైన 'తమ్ముడు', 'రాబిన్‌హుడ్' సినిమాలు కూడా డిజాస్టర్లుగా మారి ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ పరిస్థితుల్లో రూట్ మార్చిన నితిన్, కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. విభిన్న కాన్సెప్ట్‌లతో సినిమాలు తెరకెక్కించే ఆనంద్, నితిన్ కోసం ఒక కొత్త తరహా కథను సిద్ధం చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి ఆసక్తి నెలకొంది. ఇంతలోనే నితిన్ మరో రెండు క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందులో ఒకటి 'ఆయ్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న దర్శకుడు అంజి చెప్పిన కథ. ఈ చిత్రాన్ని నితిన్ తన సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ట్ మూవీస్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. జూలై నుంచి షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇదే కాకుండా, మరో ప్రముఖ నిర్మాణ సంస్థలో ఒక కొత్త దర్శకుడితో సినిమా చేయడానికి కూడా నితిన్ సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే నెలలో వెలువడే అవకాశం ఉంది.

'ధురంధర్ 2'సినిమాపై రామ్ చరణ్ ప్రశంసలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం 'పెద్ది' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు సన దర్శకత్వంలో రూపొందుతున్న ఈ స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా తాజాగా చరణ్ చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన ధురంధర్ 2 సినిమాపై రామ్ చరణ్ ప్రశంసలు కురిపించారు. "ధురంధర్ ది రివెంజ్ చాలా ఉత్కంఠభరితంగా ఉంది. సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు ప్రేక్షకులను కట్టిపడేస్తుంది" అంటూ ఆయన పేర్కొన్నారు. దర్శకుడు ఆదిత్య ధర్ పనితీరును కొనియాడుతూ, "ఈ సినిమా స్థాయి, భావోద్వేగాలను అద్భుతంగా తెరకెక్కించారు. ఆయన పనితనం నిజంగా ఆశ్చర్యకరం" అని తెలిపారు. ఈ సినిమాలో హీరోగా నటించిన రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జీ, నటనతో మరోసారి ప్రేక్షకులను మెప్పించారని చరణ్ అన్నారు. అలాగే ఆర్ మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ తమ పాత్రల్లో అద్భుతంగా నటించారని చెప్పారు. చిన్న వయసులోనే మంచి నటనతో ఆకట్టుకున్నసారా అర్జున్‌ని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్‌దేవ్ అందించిన సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లిందని తెలిపారు.

Printed, Published and Owned by **B. PRAMOD KUMAR**, B258, Phase1, Vanasthalipuram, Hyderabad 70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor : **N. Ramakrishna Reddy**, email: citytimestd@gmail.com, **RNI: APTEL/2001/5896**